వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 24 అక్టోబర్ 2022

## జిల్లా ప్రజలకు కలెక్టర్, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు దీపావళి శుభాకాంక్షలు

కడప అక్టోబర్ 23, ప్రభాతవార్త

చీకట్లపై వెలుగు సాధించే విజయానికి చిహ్నంగా.. హిందువులు సంప్రదాయంగా దేశవ్యాప్తంగా దీపావళిని కన్నుల పండువగా చేసుకోవడం ఆనవాయితీ. ఈ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటూ.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాషా, జిల్లా ఇంఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు, ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంటింటా దీపాలు.. రంగుల వెలుగుల దీపపు కాంతులు.. శుభాలకు ప్రతిరూపాలుగా కనువిందు చేసే... దీపావళి పండుగ.. ఎన్ని కష్టాలు ఎదురైనా.. నిరాశ చెందకుండా... ఎదురునిలిచి పోరాడి విజయం వైపు నడవాలనే సందేశాన్ని సమాజానికి అందిస్తుంది. జిల్లాలో ఈ పండుగను ప్రతి ఒక్కరూ.. ఉన్నంతలో ఘనంగా.. ఆనందంగా చేసుకుంటారు. పటాసులు, నిప్పు వంటి వాటితో జాగ్రత్తగా వ్యవహరిస్తూ.. పిల్లలు ..పెద్దల సమక్షంలో, యువత దుడుకుపాటు లేకుండా.. ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా ఈ దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

రాయచోటి అక్టోబర్ 23, ప్రభాతవార్త

చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా... భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా.. జాతి, మత, కుల, వర్గ విభేదాలను విస్మరించి విజయానికి ప్రతీకగా దేశవ్యాప్తంగా సమైక్యంగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కాకాని గోవర్ధన్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్ రెడ్డి, శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం, కలెక్టర్ గిరీష పిఎస్, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎంపీ పి. మిథున్‌రెడ్డి, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ , జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియాలు ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. నరకాసురుడనే రాక్షసుని సంహరించి అతని పీడ వదిలిన ఆనందంలో... ఇంటింటా దివ్య వెలుగుల దీపాలను వెలిగిస్తూ ఆనందోత్సాహాల మధ్య ప్రజలందరూ దీపావళి పండుగ జరుపుకుంటారని భార తీయ పురాణాలు చెబుతున్నాయి. చెడును త్యజించి మంచిని పెంచాలని... మతాబులు, చిచ్చుబుడ్ల, కాకరవత్తులు వెలుగులతో జిల్లాలో ప్రతి ఇంట శుభాలు కలగాలని వారు ఆకాంక్షించారు. టపాసులు కాల్చే సమయంలో పిల్లలు, పెద్దలు అందరూ తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆనందోత్సాహాలతో దీపావళి పండుగను జరుపుకోవాలని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అవినీతి మామూలే...!

### కీలక శాఖలలో భారీగా పెరిగిన లంచాల సంస్కృతి



రాయచోటి.అక్టోబర్ 23 ప్రభాతవార్త

ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకంగా కాగిత రహితంగా కార్యకలాపాలు నిర్వహించే దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో ప్రభుత్వ శాఖలలో అవినీతి సర్వసాధారణంగా మారింది. అవినీతి అక్రమాలు జరిగితే సహించేది లేదంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరికలు జారీ చేస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలలో షరా మామూలుగా తయారయ్యాయి. ముఖ్యంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మైనింగ్, టౌన్‌ప్లానింగ్, వాణిజ్య, పన్నుల శాఖలలో ముడుపులు దండుకుంటూ తిమ్మిని బమ్మిని చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ప్రతి ఫైలుకు రేటు నిర్ణయించి ముక్కు పిండి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇటీవల ఏసిబి ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతిని కూకటి వేళ్లతో తొలగించాలంటూ స్పష్టమయిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సులభంగా, వేగంగా సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇన్ని సంస్కరణలు తీసుకువస్తున్న అవినీతి తిమింగళాల వ్యవహార శైలితో సేవలుకు బ్రేక్‌లు పడుతున్నాయి. అవినీతి అక్రమాలకు పాల్పడే అధికారులు ఉద్యోగులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు నిరంతరం దాడులు నిర్వహిస్తున్నా ప్రభుత్వ శాఖలలో అవినీతి సర్వసాధారణంగా మారింది. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ ఫలాలు లబ్దిదారులకు అందాలంటే ముడుపులు చెల్లించుకోవాల్సిన దుస్తితి ఉంది. అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు సంబందించి ప్రతి దానికి లంచం చెల్లించుకోవాలసిందే. ముడుపులు ముట్టనిదే పనులు జరగవనేది జగమెరిగిన సత్యం. మరో వైపు బదిలీలకు పెద్ద మొత్తంలో చేతులు తడిపి పని చేయడానికి వచ్చిన అధికారులు సీట్‌లలో కూర్చోగానే వసూలు దందా ప్రారంభిస్తున్నారని విమర్శలు వివిధ శాఖలలోను ఉన్నాయి. రెవెన్యూ పంచాయతీ రాజ్ రిజిస్ట్రేషన్ మున్సిపాలిటి, వైద్యశాఖ, పోలీస్, రవాణా, వాణిజ్య, పన్నుల శాఖ ఇలా ప్రతి శాఖలో అవినీతి సర్వసాధారణంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబందించి జిల్లాలో దాదాపు 100 శాఖలుకు పైగానే పని చేస్తున్నాయి. ఈ శాఖలలో ఉద్యోగుల పనిచేస్తున్నారు. అవినీతి జరగని శాఖలేదంటే అతిశయోక్తి లేదంటున్నారు. అవినీతి నిర్మూలన సాధ్యం అంటున్న నేతలు మాటలకు బిన్నంగా వారి వ్యవహారశైలి ఉంటుందంటున్నారు. మేధావులు. మరోవైపు ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ ప్రోటోకాల్‌కు సంబందించి ప్రభుత్వం అరాకొర నిధులు కేటాయించడం కూడా పరోక్షంగా అవినీతిని ప్రోత్సహిస్తున్నట్లు అవుతుంది. ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరిగే పని లేకుండా గ్రామ వార్డు సచివాలయాలు, నెట్ సెంటర్‌ల ద్వారా అన్ని రకాల సేవలు పొందడానికి ప్రభుత్వం వీలు కల్పించింది. వివిధ సేవలకు దరఖాస్తు చేసుకున్న కార్యాలయానికి వెళ్లి ముడుపులు చెల్లించనిదే సర్టిఫికేట్‌లు అందని పరిస్థితి ఉంది. రెవెన్యూకు సంబందించి వివిధ దృవ పత్రాలు రైతులకు సంబందించి పాస్‌పుస్తకాలు, అడంగల్‌లో పేర్ల మార్పు తప్పులు సరిదిద్దడం, భూములు సర్వే, భూమి వివరాలు, భూములు నమోదు, ఫౌర సరఫరాలు, వివిధ ఈ విధమయిన పరిహారాలకు సంబందించి విఆర్‌వో నుంచి తహశీల్దార్ వరకు ముడుపులు చెల్లించాల్సిందే. పారదర్శకంగా విధులు నిర్వహించాలని ప్రభుత్వాలు ఎన్ని ఆదేశాలు జారీ చేసినా తహశీల్దార్ కింది స్థాయి సిబ్బంది బేఖాతరు చేస్తున్నారు. పాసు పుస్తకాలు కోసం నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరుగుతున్న ఫలితం ఉండటం లేదు. దరఖాస్తు చేసుకున్న 30 రోజులలో పరిష్కరించాలని స్పష్టమయిన నిబందన ఉన్నా నిబందన 29వ రోజున తహశీల్దార్‌లు దరఖాస్తులను తిరస్కరిస్తారు. ఏదో ఒక కారణం చూపి తిరస్కరిస్తున్న ఆ దరఖాస్తు రికార్డులలో మాత్రం పరిష్కరించినట్లు సూపిస్తారు. అంటే ఆ రైతు మళ్లీ రెవెన్యూ ఉద్యోగుల చుట్టు తిరిగితే ఏ విధంగా పని పూర్తి చేసుకోవాలి అని అడిగితే మార్గం చూపిస్తారు. దరఖాస్తు దారులు వ్యక్తిగతంగా కలిసి ముడుపులు చెల్లించుకున్న వారి దరఖాస్తులు మాత్రమే పరిష్కరిస్తారు. రాష్ట్రప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని సమకూర్చే శాఖలలో రిజిస్ట్రేషన్ శాఖ కీలకమయినది. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఆదాయం ప్రభుత్వానికి ఎలా లభిస్తుందో అందులో పని చేస్తున్న ఉద్యోగులు అధికారులు కూడా ముడుపుల రూపంలో లబ్ది పొందుతున్నారు. భూ క్రయ విక్రయాల కొరకు మన ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టినా ముడుపులు చెల్లించనిదే రిజిస్ట్రేషన్ అవడం కష్ట సాధ్యమంటున్నారు. భూములు రిజిస్ట్రేషన్‌కు సంబందించి దళారుల ప్రమేయం లేకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో పనులు జరగడం లేదనేది జగమెరిగిన సత్యం. ముడుపులు చెల్లిస్తే భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేస్తారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన ఏసిబి ఉన్నతాధికారులు సమక్షంలో వివిధ శాఖలలో జరుగుతున్న అవినీతిపై చర్చించి ఇందుకు బాధ్యులయిన అధికారులు ఉద్యోగులపై దాడులు ముమ్మరం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో అధికారులు ఉద్యోగులలో ఏమేరకు పరివర్తనం రావడం లేదు. అవినీతి నిరోదక శాఖ అధికారులు ముమ్మరంగా దాడులు చేస్తే ఉద్యోగులలో పరివర్తనం వస్తుందేమో అని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# చీకటి తొలగించి వెలుగు నింపే పండుగే దీపావళి





రాయచోటి.అక్టోబర్ 23 ప్రభాతవార్త

చీకటి నుంచి వెలుగులు నింపే పండుగే దీపావళి, సత్యభామ దేవి నరకాసురుడిని వధించిన తదుపరి రోజు ప్రజలంతా దీపాలు వెలిగించి జరుపుకున్న పండుగగా దీపావళిని పేర్కొంటారు. నాటి నుంచి ప్రతి ఏటా ఆశ్వీజ శుక్ల చతుర్దశి నాడు ఈ పండుగను ప్రజలంతా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ పండుగను ప్రతి ఏటా జరుపుకుంటున్న నేటి ఆధునిక యువతకు దాని ప్రాముఖ్యత తెలియని పరిస్థితి దానిని గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం. ద్వాపర యుగంలో అసురుడయిన నరకాసురడనే రాజు ఉండేవాడు. ఈ రాక్షసుని బారినపడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అయితే నరకాసురునికి తన మరణం తల్లి చేత తప్ప మరి ఇతర దేవతలు ప్రాణులు చేత మరణం లేకుండా వరం పొందాడు. ఆ కారణంగా దేవతలు సైతం నరకాసురుని వధించే సాహసం చేయలేక పోతారు. ఈ తరుణంలో శ్రీకృష్ణుడు సత్యభామ సమేతంగా నరకాసురిపై దండయాత్ర చేస్తారు. ఇందులోనూ ఒక పరమార్ధం ఉంది విష్ణుమూర్తి భూదేవిలు సంతానమే నరకాసురిడిగా పురాణాలు చెబుతున్నాయి. ఈ నేపద్యంలోనే శ్రీ కృష్ణుడు సత్యభామతో కలిసి నరకాసురినిపై యుద్ధం ప్రకటిస్తాడు. తీరా యుద్ధభూమిలో ప్రవేశించిన తర్వాత కృష్ణుడు స్పృహ కోల్పోయినట్టుగా కింద పడిపోవడంతో ఆగ్రహావేశిరాలైన సత్యభామ దేవి నరకాసురుడిని వధిస్తుంది. ఇది పురాణాలు చెబుతున్న కథనాటి నుంచి నేటికి ప్రజలంతా ఆశ్వీజ శుక్ల చతుర్దసి నాడు దీపావళి పండుగను కుల మతాలకతీతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే ఈ శుభకార్యం చేపట్టిన తొలుత జ్యోతిని వెలిగించడం పరిపాటిగా వస్తుంది. దీపపు ప్రమీదలో పోసే నెయ్యి నూనె వత్తి మనుసులోని కోరికలు అహంభావధోరణులకు సంకేతం భగవంతుని ముందు దీపం వెలిగించగానే మనలోని కోరికలు నెమ్మదిగా ఆవిరవుతూ అహం కాలిపోతూ స్వచ్చమైన మనసు నింపుతుందని ప్రతిదీ చతుర్దశి రోజు నరక చతుర్దశిగాను, రెండవ రోజు దీపావళిగాను మూడో రోజు బహుళ పార్టీ మీద జరుపుకుంటారు. ఈ పండుగ జ్ఞానానికి ఐశ్వర్యానికి ఆనందానికి ప్రతీకగా నిలచే జ్యోతి మహాలక్ష్మి స్వరూపం అలాంటి దీపావళి నాడు జ్యోతిని లక్ష్మీదేవిలా భావించి గృహిణిలు లక్ష్మీదేవి పూజ చేస్తారు. నమ్మకంతో దీపాలతో చేయాల్సిన ఈ పండగ ప్రస్తుతం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి టపాసులను ప్రజలు కాలుస్తూ ప్రకృతిని కలుషితం చేస్తున్నారు. ఇప్పటికైనా భావి పౌరులకు కాలుష్య రహిత ప్రకృతిని అందించేందుకు మనమంతా దీపావళి పండగ నాడు దీపాలు వెలిగించి ప్రశాంతంగా ఈ పండుగను జరుపుకుందాం.



# వైయస్ఆర్ బీమా పేరుతో మోసం

నలుగురు అంతర్జాతీయ ముఠా అరెస్ట్

- నేపాల్‌లో ఒకరిని, ఢిల్లీలో ముగ్గురిని అరెస్టు చేసిన ప్రత్యేక పోలీసు బృందం
- రూ.3.29లక్షలు నగదు, 73 ఏటీం కార్డులు, 18 మొబైల్ ఫోన్లు, 290 సిమ్ కార్డులు స్వాధీనం

విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ తుషార్ డూడి



కడప క్రైం, అక్టోబరు 23, ప్రభాతవార్త: కోవిడ్ మరణాలకు సంబంధించి వైఎస్ఆర్ బీమా అనే పేరుతో ప్రజలను వంచించి మోసగిస్తున్న అంతర్జాతీయ ముఠాను వైఎస్ఆర్ జిల్లా పోలీసులు లాహోర్‌లో 1, ఢిల్లీలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు అదనపు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3.29లక్షలు నగదు, కొటాక్ మహింద్రా బ్యాంక్‌కు చెందిన 73 ఏటీం కార్డులు, 18 ఫోన్లు, 290 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదివారం పెన్నార్ కాన్ఫరెన్సులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. అరెస్టు అయిన వారిలో నేపాల్‌కు చెందిన అశోక్ లాహోర్‌తో పాటు కడప జిల్లా ఖాజీపేట మండలం మిడుతూరుకు చెందిన మీనుగ నరేంద్ర, జంగంపల్లె జనార్ధన్, ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అల్లినగరం గ్రామానికి చెందిన ఆవులమంద నారాయణ అనే నలుగురిని అరెస్టు చేశామన్నారు. కడప నగరానికి చెందిన ఒంటిబీరం రమణారెడ్డి, నిర్మల, ఖాజీపేటకు చెందిన నాగవేణి, విగ్నేశ్వర, పెండ్లిమర్రి చెందిన విజయకుమారి, బి.మఠం చెందిన కృష్ణచైతన్య, ప్రొద్దుటూరుకు చెందిన కృష్ణచైతన్య, జింకా హరితల ఫిర్యాదు మేరకు కడప వన్‌టౌన్ పోలీసులు జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు వీరు ఢిల్లీ కేంద్రంగా ఓ ఇంటిలో అద్దెలో ఉంటూ వైఎస్ఆర్ బీమా పేరుతో కోవిడ్‌తో మరణించిన వారి వివరాలు సేకరించి బీమా సొమ్ము పంపుతామని మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సుమారు రూ.9లక్షలు వారి ఖాతాల నుంచి మోసానికి పాల్పడినట్లు పిర్యాదులో తేలిందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 6వ తేదీ కడప వన్‌టౌన్‌లో సీఐ నాగరాజు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. విచారణలో భాగంగా తన ఆధ్వర్యంలో కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి, పోరుమామిళ్ల సీఐ ఎం.రమేష్‌బాబు, ఖాజీపేట ఎస్సై కుళాయప్ప, సైబర్ క్రైం ఎస్సైలు మధుమల్లేష్, ఆర్.వి.కొండారెడ్డిలు ప్రత్యేక బృందంగా ఏర్పడి ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. ఎవరైనా ఫోన్ చేసి లింక్‌లు పంపి ఓటీపీ తదితర వివరాలు చెప్పమంటే ప్రజలు మోసపోవద్దని ఈ సందర్భంగా ఏఎస్పీ తెలిపారు. ఏమైనా సమాచారం ఉంటే జిల్లా ఎస్పీ ఫోన్ నెంబరు కానీ, సంబంధిత పోలీసులకు తెలపాలని ఆయన ప్రజలకు సూచించారు. ముద్దాయిలపై కేసు నమోదు చేసి కోర్టుట్లులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ముద్దాయిలను అరెస్టు చేయడంలో కీలకపాత్ర వహించిన ప్రత్యేక బృందాన్ని ఈ సందర్భంగా అభినందించామన్నారు. వారికి రివార్డులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

# అసలేం జరిగింది?

### అదృశ్యమైన 4 రోజుల తర్వాత పెన్నానదిలో శవమై తేలిన డిగ్రీ విద్యార్థిని
### పోలీసుల అదుపులో నిందితుడు





రాజంపేట అర్బన్, అక్టోబరు 23 ప్రభాతవార్త

4 రోజుల క్రితం కళాశాలకు వెళ్లి కనిపించకుండా పోయిన విద్యార్థిని ఏమైంది? పెన్నానదిలో శవమై ఎలా తేలింది? ఇందుకు కారణం ఎవరు? అసలు ఏమి జరిగింది? బద్వేలు, బి.కోడూరు మండలాల్లో సంచలనం సృష్టించిన డిగ్రీ కళాశాల విద్యార్థిని పెన్నానదిలో శవమై తేలడం సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే బి.కోడూరు మండలం మరాటిపల్లెకు చెందిన అనూషా బద్వేల్‌లోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బికాం 2వ సంవత్సరం చదువుతోంది. అనూషాతో గురుమహేష్ అనే విద్యార్థి సన్నిహితంగా మెలుగుతున్నట్లు సమాచారం. ఈనెల 20న కళాశాలకు వెళ్లిన అనూషా ఇంటికి చేరలేదు. దీంతో అనూషా తల్లిదండ్రులు మరుసటిరోజు తమ కుమార్తె కాలేజికి వెళ్లి కనిపించకుండా పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆదివారం ఉదయం పెన్నానదిలో అనూషా శవమై తేలింది. గుర్తుపట్టలేని విధంగా మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. మృతదేహాన్ని పరిశీలిస్తే ఏదో జరిగిందనే అనుమానాలు వచ్చేలా పరిస్థితి కనిపిస్తోంది. సమాచారం అందుకొన్న సిద్దవటం పోలీసులు అనూష మృతదేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం కోసం కడపకు తరలించారు. అనూష బద్వేలు నుంచి ఎప్పుడు సిద్దవటం సమీపంలోని పెన్నానది వద్దకు వచ్చింది. పెన్నాననదిలో శవమై ఎలా తేలింది? అనూష తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న బద్వేలు మండలం పాపిరెడ్డిపల్లెకు చెందిన గురుమహేష్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితుడి నుంచి సమాచారం రాబట్టేందుకు ఇంటరాగేషన్ చేస్తున్నారు. గురు మహేష్‌నే అనూష మృతికి కారణమై ఉండ వచ్చునని పోలీసులు, హతురాలి తల్లి దండ్రులు భావిస్తున్నారు. నది వద్ద నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతంలో ఏమి జరిగిందో తెలియాల్సి ఉంది. సిద్ధవటం పోలీసులు గురు మహేష్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నేడో రేపో నిందితున్ని కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది.

# ఒక్క అవకాశంతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

- మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి యువనేత రితీష్‌కుమార్ రెడ్డిలు - వైసిపి ప్రభుత్వంలో విసుకు చెందిన ప్రజలు






పోరుమామిళ్ళ రూరల్, అక్టోబర్ 23ప్రభాతవార్త:

ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే ముఖ్యమంత్రి వైఎస్. జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి యువనేత రితీష్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. పోరుమామిళ్ళ పట్టణంలో బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా ఆదివారం వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్ర ఆదాయం పెరగలేదు, ప్రజలు ఆదాయం పెరగలేదని ఖర్చులు మాత్రం అమాంతం పెరిగాయన్నారు. వైసిపి ప్రభుత్వంపై బాదుడే బాదుడు పేరిట టిడిపి నిరసనలో ఆదివారం పోరుమామిళ్ళ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుండి వేణుగోపాల స్వామి గుడి వరకు తెదేపా పోరుమామిళ్ళ మండలాధ్యక్షుడు నగిరి భైరవ ప్రసాద్, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగపు ప్రధాన కార్యదర్శి యనమల సుధాకర్, శ్రీశైలం మాజీ బోర్డు మెంబర్ సీతా వెంకటసుబ్బయ్య, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మెన్ చెన్నరాముడు, టిడిపి నాయకులు గాలి మురళీ, చెరుకూరి రవి, మాజీ ఎంపిటిసి ఇమామ్ హుస్సేన్, కృష్ణారెడ్డి తదితరులతో కలసి రితీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. బాదుడే బాదుడు నిరసన కార్యక్రమానికి టిడిపి కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ సర్కిల్ నుండి వేణుగోపాలస్వామి గుడి వరకు భారీ ఎత్తున ర్యాలీలో వెళ్తూ ప్రజలకు కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత టిడిపి హయాంలో నిత్యవసర ధరలు ఎలా ఉన్నాయి, వైసిపి ప్రభుత్వంలో ఎలా ఉన్నాయి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు, ఆర్టీసి, ఇంటి పన్నులు, చెత్త పన్నులు, వైకాపా ప్రభుత్వం విపరీతంగా పెంచిన నేపథ్యంలో ప్రజల్లో మార్పు తథ్యమని వారన్నారు. అదే విధంగా బద్వేలు నియోజకవర్గంలో వైకాపా నాయకుల భూకబ్జాలు అవినీతి అక్రమ సంపాదనతో ప్రజలు విసిగి చెందారని ఈసారి తెదేపాకు ఓటు వేసి అధికరణ ఇస్తారని రితీష్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సీనియర్ నాయకుల సలహాలు, సూచనల మేరకు కార్యకర్తలు అంటే సామాజిక వర్గాల ప్రజలను కలుపుకొని 2024 సార్వత్రిక ఎన్నికల్లో బద్వేల్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని వారన్నారు. వైకాపా ప్రభుత్వంలో నష్టపోయినటువంటి పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలను అందరిని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదుకుంటామని వారన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఝాన్సీ, జిల్లా కార్యదర్శి సుబ్బారావు, మాజీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నీళ్లున్నా.. సాగు సున్నా

- వందలాది ఎకరాల్లో మొలిచిన ముళ్లకంపలు
- పూడుకుపోయిన సాగు కాలువలు



ఆయకట్టు భూమిలో యదేచ్ఛగా మొలిచిన ముళ్లకంపలు

బి.కొత్తకోట, అక్టోబర్ 23 ప్రభాతవార్త :

ప్రకృతి కరుణించి చెరువులు నిండినా పంటలు పెట్టి సాగు చేసుకోలేని నిస్సహాయ స్థితిలో రైతులు కొట్టుమిట్టాడు తున్నారు. కారణం పంటలు పెట్టడానికి పెట్టుబడులు భారీ గా అవసరం కావడం, ఎన్నో ఏళ్లగా చెరువుల క్రింద సాగు నీటి కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడం, ఆయకట్టు భూముల్లో ముళ్లకంపలు మొలిచిపోవడం తదితర ప్రధాన సమస్యలతో అన్నదాతల పంటల సాగుపై మక్కువ ఉన్నా సాగుచేయలేని దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. గత నవంబర్‌లో కురిసిన వర్షాలకు చిన్నా పెద్దా చెరువులన్నీ నిండాయి. సాగు చేయాలని రైతులు భావించినా క్షేత్రస్థాయి లో పరిస్థితులు అనుకూలించకపోవడంతో 25 శాతం చెరు వుల కింద కూడా పంటలు పూర్తిగా సాగు కాలేదు. 75 శా తం చెరువుల కింద ఆయకట్టు భూములు బీళ్లుగానే మిగిలాయి. ఇప్పుడు ఖరీఫ్ సీజన్ మొదలవుతోంది. వర్షాలు పడు తున్నాయి, మళ్లీ చెరువులు నిండుతున్నాయి. అయితే చెరు వుల కింద పంట కాలువలు పూడిపోయి ముళ్లకంపలు మొల వడంతో ఆయకట్టు భూములకు నీళ్ల పారే పరిస్థితి కానరావడం లేదు. ఆయకట్టు భూముల్లో ముళ్లకంపలు తొలగించా లంటే వేలల్లో ఖర్చు పెట్టాల్సివస్తోంది. ఆపై పంటల సాగుకు, దున్నకాలకు, ఎరువులకు, క్రిమి సంహారక మందు లకు భారీగా పెట్టుబడులు పెట్టాల్సివస్తోందని, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టినా పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశం లేదని రైతులు గట్టిగా నమ్ముతున్నారు. అందుకే తంబళ్లపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాజెక్టులు పెద్దచెరువుల్లో నీళ్లున్నా రైతులు పంటలు సాగుచేయడం లేదు. అప్పులు చేసి పంటలు పెట్టి నష్టపోవడం కన్నా భూములను బీళ్లుగానే వదిలేయడం మేలని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు.

రేపు వైయస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో పీజీ సెట్ ప్రవేశాలు IIలో

ప్రమాదాలకు నెలవు హైవే రహదారి IVలో

## భగవాన్ ధన్వంతరి జయంతి ఉత్సవాలు

రాయచోటి.అక్టోబర్ 23 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా కేంద్రం రాయ చోటి పట్టణంలో, స్థానిక డైట్ పాఠశాల ఆవరణం నందు ఆదివారం ఉదయం 10 గంటలకు నాయి బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ ఆధ్యక్షతన శ్రీ భగవాన్ ధన్వంతరి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి నాయి బ్రాహ్మణ ఉద్యోగ సంస్కృతిక సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుడిబండ శ్రీనివాసులు ముఖ్య అతిధిగా పాల్గొని, ధన్వంతరి జయంతి ప్రాముఖ్య తను వివరిస్తూ నాయిబ్రాహ్మణుల సంక్షేమానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు. ఆ కార్యక్రమంలో స్థానిక వైద్యులును ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సమావేశానికి స్థానిక వైద్యులు డా.రవీంద్ర, రామచంద్ర, రెడ్డెన్న, శ్రీరాములు, మరియు సంఘ సభ్యులయిన పి.వి.క్రిష్ణయ్య, శివశంకర్, సుబ్రమణ్యం, దిలీప్, కార్తీక్ పాల్గొన్నారు.

## వైఎస్సార్ స్ఫూర్తితో ధర్మపోరాటం చేస్తాం

రాయచోటి టౌన్.అక్టోబర్ 23 ప్రభాతవార్త

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో 20 సంవత్సరాలుగా పని చేస్తూ అన్ని అర్హతలు ఉన్న కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్‌తో 2020 నవంబర్ 1 ఇడుపులపాయ నందు వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి సాక్షిగా ప్రతిజ్ఞ చేసి తీసుకున్న సంకల్పంతో నిర్ణయం మేరకు శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్దతిలో వైఎస్సార్‌స్ఫూర్తితో ధర్మపోరాట ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఏపి డిఎస్సీ కాంట్రాక్ట్ ఫారామెడికల్ ఉద్యోగుల జేఏసి రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక పత్రిక ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. వైఎస్సార్‌సిపి ఎన్నికల మేనిఫెస్టో 2019 హామీ మేరకు ఇంకా ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కాంట్రాక్టు ఫారామెడికట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో ఏపిడిఎస్సీ కాంట్రాక్ట్ ఫారామెడికల్ ఉద్యోగుల జేఏసి రాష్ట్ర కమిటి చర్చించి గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన విభిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఫారామెడికల్ ఉద్యోగులు రెగ్యులర్ అయ్యే వరకు, ధర్మపోరాటం కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

## యువతను సన్మార్గంలో నడిపించడమే ఐవైయమ్ లక్ష్యం

ఐడియల్ యూత్ మూమెంట్ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం షరీఫ్

ప్రొద్దుటూరు అక్టోబర్ 23, ప్రభాతవార్త




ప్రస్తుత సమాజంలో యువత చెడు వ్యసనాలకు లోనవుతున్న నేపథ్యంలో వారిని సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేయడమే ఐడియల్ యూత్ మూమెంట్ పనిచేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పెన్నా నగర్‌లో జైనబ్ మసీదు ఆవరణలో ఐడియల్ యూత్ మూమెంట్ ప్రొద్దుటూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఏపీలో జిల్లా సదస్సులు ఏర్పాటు చేసి ముస్లిం యువత భాగస్వామ్యంతో 2023 జనవరి 28 29 తేదీలలో ఐడియల్ యూత్ మూమెంట్ రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లా సదస్సులలో యువత ను మేల్కొల్పి మంచి సమాజాన్ని స్థాపించే దిశగా వారిని భాగస్వామ్యులను చేసి యువతను సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖలీ ముల్లాఖాన్, ప్రొద్దుటూరు శాఖ పట్టణ అధ్యక్షులు మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో 2015 -16 నుండి ఐడియా యూత్ మూమెంట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించా మన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షులు జబీవుల్లా, కడప పట్టణ అధ్యక్షులు జీషాన్ పాల్గొన్నారు.

## నగదు సరుకుల వితరణ

ప్రొద్దుటూరు అక్టోబర్ 23, ప్రభాతవార్త



మైదుకూరు మండలం జీవి సత్రం నర్సరీ యజమాని సుధాకర్ రెడ్డి దగ్గర సుబ్బారాయుడు భార్య బాలింత మహిళ ను నిర్బంధించిన అమానవీయ ఘటనపై స్పందించిన హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కరుణాకర్ మరియు సంస్థ సభ్యులు విషయాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో పిర్యాదు చేశారు. ఈ విషయమై ఆదివారం జాండ్లవరం ఎస్టి కాలనీలో బాధితు లను పరామర్శించి ఓదార్చి, బాధితులకు అండగా ఉండి, జాతీయ మానవ హక్కు ల కమిషన్‌లో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కరుణాకర్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుబ్బరాయుడు నిరక్షరాస్యత కలిగిన ఎస్టీలు ఐనందున కనీస వేతనం ఇవ్వకుండా, వెట్టిచాకిరి చేపించుకుంటూ యజ మాని సుధాకర్ పని చేయించుకున్నాడని, 11 సంవత్సరాలు తన దగ్గర పనిచేసిన వ్యక్తికి మానవత్వం లేకుండా సభ్య సమాజం తల దించుకునేలా యాజ మని వ్యవహరించారని తెలిపారు. బాధితులకు హాస్పిటల్ ఖర్చులకు ఆర్థిక సహాయం జీవనం గడవడానికి నిత్యావసర వస్తువులు అంద చేశారు. కార్యక్రమంలో ఇంజా లక్ష్మి రెడ్డి, గుమ్మల రవి శంకర్ రెడ్డి, పృధ్వి తేజ్, సురేష్, రాజేష్, జయరాజు, వంశి, కౌశిక్, కార్తిక్, గురు, శ్రీనివాసులు, జనార్దన్, నరసింహ, వడ్ల నరేష్, గంటా వెంకటయ్య పాల్గొన్నారు.

## గాలివీడు మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటి ఏకగ్రీవ ఎన్నిక

గాలివీడు.అక్టోబర్ 23 ప్రభాతవార్త



గాలివీడు మండల నూతన ప్రెస్‌క్లబ్ కమిటీని ఆదివారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బాబు (ఈనాడు), ఉపాధ్యక్షునిగా ప్రభాకర్ (సాక్షి), ప్రధానకార్యదర్శిగా రమేష్ (విశాలాంధ్ర), కోశాధికారిగా రామక్రిష్ణ (వార్త), సహాయ కార్యదర్శులుగా వెంకటరెడ్డి (ఆంధ్రజ్యోతి), విశ్వనాథరెడ్డి, (ఆంధ్రప్రభ), భాస్కర్ (ప్రజాశక్తి)లను కార్యవర్గ సభ్యులుగా కిరణ్‌కుమార్ (ప్రతినిత్యం), రెడ్డి రుషికేష్ (మనం), భాస్కరా చారి(మన జన ప్రగతి), కృష్ణమాచారి (న్యాయం), గౌస్ (సూర్య నేటి దిన పత్రిక), అంజి (నేటి మనదేశం) కమిటి గౌరవ సలహా దారులుగా సీనియర్ జర్నలిస్ట్ నాగేశ్వరరావ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు బాబు మాట్లాడుతూ మండల ప్రజలకు, అధికారులకు ప్రజాప్రతినిధులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటామని, నాపై నమ్మకం ఉంచి గాలివీడు మండల మొట్టమొదటి ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు తోటి పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## విజయానికి ప్రతీక దీపావళి : శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్.అక్టోబర్ 23 ప్రభాతవార్త



చెడుపై మంచి సాధించిన విజయా నికి ప్రతీకగా దీపావళి నిలుస్తుందని వైఎస్సార్‌సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జ్ఞానానికి, ఆనందానికిక, వికాసానికి, విజయా లకు ప్రతిరూపం దీపావళి అని పేర్కొన్నారు. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తిల శోభావళి అని ఎన్నో విజయోత్సవ చరిత్రలను కలిగిన దివ్య చరితావళి ఈ దీపావళి అని ఆయన తెలిపారు. ఈ దీపావళి ఆంధ్రప్రదేశ్‌కు విజయాల వరుస కావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరికి సకల శుభాలు, శాంతి సౌభాగ్యాలు, అష్టై శ్వర్యాలు అందాలని, ప్రతి ఇంటా ఆనందపు కాంతులు వెదజల్లాలని, అజ్ఞానాంధకారాలు తొలగి విజ్ఞానపు వెలు గులు, ఆనంద దివ్వెలు వెలగాలని ఆయన ఆకాంక్షించారు. రాయచోటి నియోజక వర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## 26న మండల స్పోర్ట్స్‌మీట్

నందలూరు, అక్టోబరు 23 ప్రభాతవార్త

నందలూరు మండల స్థాయి ఎస్‌జిఎఫ్ గేమ్స్‌ను ఈనెల 26వ తేదిన జరప బడనున్నట్లు తెలిపారు. నందలూరు మండల హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎస్.కృష్ణయ్య తెలిపారు. ఈ విషయంలో మండలంలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు గమనించి ప్రతి స్కూల్ నుంచి ఒక్కో గేమ్‌కు ముగ్గురు లేదా నలుగురు పిల్లలు పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. ఇందులో అథ్లె టిక్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ ఆటల్లో సెలక్షన్ జరుపబడునని ఆయన తెలిపారు.

## సంక్షేమ పథకాల సారథి జగన్ : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు అక్టోబర్ 23, ప్రభాతవార్త



రాష్ట్రంలోని పేద కుటుంబాల ప్రజలకు ఆర్థిక భరోసాను కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల సారథిగా నిలిచారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 15వ వార్డులో కౌన్సిలర్ ఎం వెంకటసుబ్బారెడ్డి నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా బాలాజీ నగర్ 2,3 వీధులలో పర్యటిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు ఇంకా ప్రజలకున్న సమస్యలపై ఆయన ఆరా తీశారు అర్హత ఉండి సంక్షేమ పథకాలు లబ్ది పొందని ప్రజలు ఉంటే తన దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కల సహకారం చేసేందుకు ప్రొద్దుటూరు నియోజక వర్గంలో 24 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. ఇంటి నిర్మాణం కోసం అదనంగా 70 వేల రూపాయలు తమకు భారం అవుతుందని లబ్దిదారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా నేరుగా నగదును మహిళల ఖాతాలలో జమ చేసే సంగతిని గుర్తు చేస్తూ కొంతమేరకు లబ్దిదారుడు డబ్బును పెట్టుకుంటే ఇంటి నిర్మాణం అన్ని వసతులతో నిర్మించవచ్చని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, కౌన్సిలర్లు వరికుటి ఓబులరెడ్డి సత్యం, జిలాని, వైసీపీ సీనియర్ నాయకులు కాకర్ల నాగశేషారెడ్డి టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షులు అక్రమ్ మహమ్మద్ గౌస్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి, తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చౌడం రవి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మల్లికార్జున యాదవ్ ఆచారి కాలనీ శివారెడ్డి పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

### -ఇంచార్జ్ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి

రాయచోటి.అక్టోబర్ 23 ప్రభాతవార్త



చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా, జాతి, మత, కుల, వర్గ విభేదాలను విస్మరించే విజయానికి ప్రతీక గా దేశవ్యాప్తంగా సమైఖ్య ంగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రివర్యులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం, జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాట అమర్‌నాథరెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియాలు ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడును త్యజించి మంచిని పెంచాలని, మతాబులు, చిచ్చుబుడ్ల, కాకరొత్తులు వెలుగులతో జిల్లాలో ప్రతి ఇంటా శుభాలు కలగాలని వారు ఆకాంక్షించారు. టపాసులు కాల్చే సమయంలో పిల్లలు, పెద్దలు అందరు తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆనందోత్సాహాలతో దీపావళి పండుగను జరుపుకోవాలని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### సాహిత్యం, వాస్తుకళారంగం

భారతదేశానికి బౌద్ధమతం సాహిత్యం, వాస్తుకళారంగాల్లో ఎనలేనిసేవలను అందిం చింది. ప్రపంచ వ్యాప్తంగానూ ప్రాచుర్యం పొందింది. అశోకుడు కనిష్కుడు లాంటి పాలకుల వల్ల బౌద్ధమతం శ్రీలంక, బర్మా, జపాన్, చైనా, టిబెట్ దేశాలకు వ్యాపి ంచింది.భారత వాస్తుకళకు పేరొందిన సాంచి సారనాథ్, బార్హుత్,అమరావతి, నాగార్జునకొండ ప్రాంతాల్లో స్తూపాలను నిర్మించారు. స్తూప, చైత్య, విహారాలు దేశ మంతా విస్తరించాయి. బౌద్ధ ఆరామాలైన నలంద, నాగార్జునకొండ,వల్లభి ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలుగా పేరొందాయి. ము ఖ్యంగా బౌద్ధమత ప్రేరణతో గాంధార, అమరావతి శిల్పకళలు అభివృద్ధి చెందాయి. ప్రాకృత, సంస్కృత భాషలతో పాటు ప్రాంతీయ భాషల్లో కూడా బౌద్ధ సాహిత్యం వెలువడింది. నాసిక్, కార్లే, కన్హేరి,అజంతా గుహాలయాల్లో చిత్రలేఖనాలు అభివృద్ధి చెం దాయి. బౌద్ధవిహారాలు ఎక్కువగా ఉన్నం దున బిహార్‌ను విహార దేశంగా పిలిచేవారు.

## టపాసులు అధిక ధరలకు అమ్మకుండా చూడాలని వినతి

ఎర్రగుంట్ల అక్టోబర్ 23, ప్రభాతవార్త

దీపావళి సందర్భంగా టపాసులు అధిక ధరలకు విక్రయించకుండా చూడాలని ఒకవేళ ఎవరైనా అమ్మితే చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరారు. దీపావళి సందర్భంగా ఎర్రగుంట్ల మండల వ్యాప్తంగా 15దుకాణాలకు అనుమతులిచ్చారు. సంవత్సరానికి ఒకసారి వచ్చే దీపావళిని ప్రజలు ఆనందంగా గడుపుకోవాలని కోరుకుంటారని దీన్ని అవకాశంగా తీసుకుని దుకాణాల యజమానులు టపాసులను అధిక ధరకు విక్రయించే అవకాశం ఉందని ,దీని వల్ల ప్రజల జేబులకు చిల్లు పడుతోందని కావున టపాసుల ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ప్రజలు కోరుకుంటున్నారు.

## వీఆర్ఏకు గాయాలు

ఎర్రగుంట్ల అక్టోబర్ 23, ప్రభాతవార్త



మండల పరిధిలోని మాలెపాడు గ్రామ సమీపంలో ఆగి ఉన్న టిప్పర్ ను ఢీకొన్న సంఘటనలో వీఆర్ఏ జగదీశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.సంఘటనా స్థలా న్ని కొండాపురం సీఐ సుదర్శన్ ప్రసాద్,కలమల్ల ఎస్సై శివప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు .కలమల్ల ఎస్సై శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు మాలెపాడు గ్రామానికి చెందిన జగదీష్ శనివారం రాత్రి మాలెపాడు నుంచి పోట్ల దుర్తికి స్కూటర్ పై బయలుదేరాడు. అదే మార్గాన రోడ్డుపై ఆగిఉన్న టిప్పర్ ను ఢీకొట్టగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు అతన్ని వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అతడిని కడపకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కలమల్ల ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

## ఉల్లిరైతులను ఆదుకోవాలి

ఎర్రగుంట్ల అక్టోబర్ 23, ప్రభాతవార్త



ఉల్లి పంటకు గిట్టుబాటు ధర 2500 రూపాయలు కల్పించి తక్షణమే ఉల్లి రైతులను ఆదుకోవాలని లేనిపక్షంలో తిరుగు బాటు తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం ఎర్రగుంట్ల మండలంలోని దండు పల్లె గ్రామంలో రైతులు పండించిన పంటను పొలాల వద్దకు వెళ్లి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎర్రగుంట్ల, వీరపునాయునిపల్లె మండలాల్లోని దండపల్లె కొమ్మద్ది గ్రామాల్లో ఉల్లి పంటను అధికంగా పండించారని అయితే ఉల్లి పంటను కొనేవారు లేరు అని అన్నారు.ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని పెట్టుకుంటున్నారని, రైతులు ఒక ఎకరాకు యాభ్కై వేల నుంచి డెబ్బై వేల వరకు పెట్టుబడి పెట్టారని ఈ ఖరీఫ్ లో వానలు అధికంగా రావడంతో ఉల్లి పంటను కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉల్లి పంటకు కనీస మద్దతు ధర 2500రూపాయలు కల్పించాలని లేనిపక్షంలో రైతులతో కలిసి మండల కేంద్రాలలో ఆందోళనకు దిగుతామని తెలిపారు. జగన్ ప్రభుత్వం సొంత జిల్లాలోని రైతులను ఆదుకోవడంలో విఫలమైందని,వారిని ఆదుకోవడంలో అలసత్వం వహిస్తోందని పైగా మాది రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ రైతులకు ఉచిత బోర్లు సూక్ష్మ సేద్యానికి సంబంధించిన డ్రిప్,స్పింకర్లు, స్ప్రేయర్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందన్నారు.నిజంగా మీది రైతు ప్రభుత్వమే అయితే ఉల్లి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతు ప్రభుత్వం అని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్ ,గంగా,సురేష్ ఎర్రగుంట్ల మండల సహాయ కార్యదర్శి నారాయణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథరెడ్డి రైతులు రమణయ్య, శివయ్య, గంగాధర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

## రేపు వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో పీజీ సెట్ ప్రవేశాలు

కడప వైవీయూ అక్టోబర్ 23, ప్రభాతవార్త

కడప నగరం లోని డాక్టర్ వైఎస్ ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ(వైఎస్‌ఆర్ ఏఎఫ్‌ఏయూ)లో 25న మంగళవారం పీజీ సెట్ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు పీజీ సెట్ -2022 చైర్మన్ ప్రొఫెసర్ మునగాల సూర్య కళావతి,పీజీ సెట్-2022 (పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) కన్వీనర్ ఆచార్య ఈ.సి. సురేంద్రనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.మాస్టర్ ఇన్ ప్లానింగ్- అర్బన్ అండ్ రీజినల్ ప్లానింగ్ 2022-23 ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశాలు పొందగర అభ్యర్థులు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాల కింద ఫీజు రీయింబర్స్మెంట్ అర్హత కలిగిన వారందరూ కుల, ఆదాయ ధ్రువీక రణ పత్రాలు, తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండుసెట్ల జిరాక్స్ ప్రతులు, 6 పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, నిర్ణీత ఫీజుతో హాజరుకావాలని సూచించారు. కౌన్సెలింగు హాజరైన అభ్యర్థులకు సీటు కేటాయింపు అదేరోజు జరుగుతుందని కన్వీనర్ ఆచార్య ఈ.సి.సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు.

## సచివాలయ ఉద్యోగులారా మనోధైర్యం కోల్పోకండి

గ్రామసచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రొద్దుటూరు అక్టోబర్ 23, ప్రభాతవార్త



కుటుంబాలకు కొండంత అండగా నిలవాల్సిన సమయంలో ఎంతటి కష్టమైనా భరించాల్సిన సమయంలో, ఆత్మనూన్యత భావానికి లోనై క్షణికా వేశం లో మనోధైర్యాన్ని కోల్పోకండి గ్రామ వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి హరేంద్ర విజ్ఞప్తి చేశారు. బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ రణధీర్ నాయక్ ఆత్మహత్యకు ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల కొన్ని విషాద సంఘటనలు మానసిక వేధింపులకు నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు కొంతమంది ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తూ పని ఒత్తిడికి గురి చేస్తున్న మాట వాస్తవమన్నారు. సచివాలయ ఉద్యోగులకు స్ట్రెస్ మేనేజ్మెంట్ అంశం గురించి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్కరికి లేని పని ఒత్తిడి వేధింపులు అవమానాలు సచివాలయ ఉద్యోగులకు ఎదుర్కొం టున్నారన్నారు పని భారం ఒత్తిడి తగ్గించుకొని మానసిక ప్రశాంతతతో నిధులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తొందర పాటు నిర్ణయాలు తీసుకొని తనువుచాలిస్తున్న ఘటనలు జరుగుతుండటం అత్యంత బాధాకరమన్నారు.

## టౌన్ బ్యాంక్ ఉపాధ్యక్షులు అక్రమ్ మహమ్మద్ గౌస్‌కు సన్మానం

ప్రొద్దుటూరు అక్టోబర్ 23, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు కోపరేటివ్ టౌన్ బ్యాంక్ ఉపాధ్యక్షులుగా రెండవసారి ఎన్నికైన అక్రమ్‌అహ్మద్ గౌస్, డైరెక్టర్ ఖలీల్ కు అల్ నూర్ హజ్ అండ్ ఉమ్రాహ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అమనుల్లా అండ్ బ్రదర్స్ చేతుల మీదుగా ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టౌన్ బ్యాంక్ ఉపాధ్యక్షులు అక్రమ్ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ తనకు రెండవసారి టౌన్ బ్యాంక్ ఉపాధ్యక్షులుగా ఎన్ను కోవ డానికి ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఎంతో గౌరవంగా సన్మానించిన అత్యంత ఆప్తమిత్రులైన అమానుల్లా బ్రదర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. టౌన్ బ్యాంకు సేవలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తానని ఆయన పేర్కొ న్నారు. డైరెక్టర్ ఖలీల్ మాట్లాడుతూ తనకు డైరెక్టర్గా అవకాశం కల్పించిన రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి వివిఎస్ ముక్తియార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చాంద్ బాషా అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

# నేరాల గుట్టు విప్పే ఫోరెన్సిక్



రోజూ పత్రికలు, టివిల్లో వార్తలెన్నో మనం చూస్తున్నాం. ఎన్నో ట్విస్టులు.. మరెన్నో సందేహాలు.. వీటన్నింటికి సమాధానమే ఫోరెన్సిక్ సైన్స్. ప్రపంచవ్యాప్తంగా నేరాలు, ఆర్థిక మోసాలు ఎక్కువయ్యాయి. మన దేశంలోను వీటి సంఖ్య తక్కువేమీ కాదు. అయితే చాలా సందర్భాల్లో పోలీసు విచారణలో లైంగిక దాడి, హత్యకు కారకులు దొరకడం లేదు. ఎన్నో కేసులు మిస్టరీగానే మిగిలి పోతున్నాయి. అసలు నేరగాళ్లను గుర్తించడానికి ప్రత్యేక నైపుణ్యాలున్న వ్యక్తులపై ఆధారపడడం తప్పని సరవుతోంది. ఆధారాలు అన్వేషించి, అసలు దోషుల గుట్టు విప్పడానికి ఆవిర్భవించిందే ఫోరెన్సిక్ సైన్స్. ఫోరెన్సిక్ సైన్స్ అంటే కేవలం హంతకులను గుర్తించే శాస్త్రమే కాదు. మోసగాళ్లను పట్టించే దివ్యాస్త్రం కూడా. అగ్నిప్రమాదాలు, ఫోర్జరీ సంతకాలు, మార్ఫింగ్, సైబర్ నేరాలు.. ప్రతిదీ ఫోరెన్సిక్‌తో ముడిపడి ఉన్నదే. ఈ రంగంలో కెరియర్ అవకాశాలు విస్తరిస్తున్నాయి. ఇందుకు డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో పలు కోర్సులు ఆవిర్భవించాయి. కేవలం ఈ తహ కోర్సులు అందించడానికి ప్రత్యేకం ఒక విశ్వవిద్యాలయ ఏర్పడింది. ఫోరెన్సిక్ సైన్స్‌పై ఆసక్తి ఉన్నవాళ్లు డిగ్రీ నుంచే ఈ కోర్సును చదువవచ్చు. సైన్స్ గ్రూప్‌తో ఇంటర్ చదివిన విద్యార్థులు బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులో ప్రవేశం పొందవచ్చు. సైన్స్ సబ్జెక్టులో డిగ్రీ పూర్తి చేసినవారు ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులో చేరడానికి అర్హులు. పీజీ అనంతరం పీహెచ్‌డీ కోర్సులు ఉన్నాయి. అలాగే పలు సంస్థలు సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులను అందిస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడు అందుబాటులో ఉన్న ఆధారాలను సేకరించడం, లభ్యమైన సమాచారాన్ని విశ్లేషించి అసలు దోషి ఎవరో నిర్ధారించడం ఫోరెన్సిక్ నిపుణుల కర్తవ్యం. కొన్నిసార్లు ఎలాంటి ఆధారాలూ లభించవ్వ. తర్కాన్ని ఉపయోగించి, పలు కోణాల్లో ఆలోచించి దోషిని గుర్తించడం పెద్ద సవాల్‌గా మారుతుంది. ఫోరెన్సిక్ సైన్స్‌లో అంతర్గతంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మెడిసిన్, సైకాలజీ, స్టాటిస్టిక్స్.. ఇలా పలు సబ్జెక్టులు ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఫోరెన్సిక్ సైన్స్‌లో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అందుకు తగినట్లుగానే మనదేశం సన్నద్ధ మవ్వతోంది. కేవలం ఈ రంగంలో అధ్యయనం కోసమే గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటయింది. మనదేశంలో ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులకు ఈ విశ్వ విద్యాలయాన్ని ముఖ్యమైన సంస్థగా చెప్పుకోవచ్చు. ఆడియో టేపుల్లో గొంతును విశ్లేషించడానికి ఫోరెన్సిక్ స్పీచ్ సైన్స్ ఉపయోగపడుతుంది. స్పెక్ట్రోగ్రామ్స్‌పై వాయిస్ శాంపిల్స్ ఉపయోగించి సులువ్వగానే ఆ గొంతు ఎవరిదో నిర్ధారిస్తారు. ఈ విభాగంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ – మైసూర్ సంస్థ ఫోరెన్సిక్ స్పీచ్ సైన్సెస్, ఫోరెన్సిక్ అకౌంటింగ్ కోర్సులు అందిస్తోంది. ఫోరెన్సిక్ అకౌంటింగ్ ద్వారా ఆర్థిక నేరగాళ్లను గుర్తించడం సాధ్యమవ్వతుంది. పాఠ్యాంశాల ద్వారా ఈ విభాగానికి సంబంధించిన సాంకేతిక నైపుణ్యాలను తెలుసుకోవచ్చు. అయితే వాస్తవ పరిస్థితిని నిశితంగా గమనించినప్పుడే ఏవైనా ఆధారాలు లభిస్తాయి. ఉన్న సమాచారాన్ని భిన్న కోణాల్లో విశ్లేషించడం, తర్కం, ఇతర విభాగాలకు చెందిన నిపుణులతో కలిసి పనిచేయాల్సి వస్తుంది. అప్పుడప్పుడు అవ్వట్‌డోర్ పని కూడా తప్పదు. సైన్స్ అంటే ఆసక్తి, గణితంలో ప్రావీణ్యం, సమాచారాన్ని విశ్లేషించగలగడం, లోతుగా ఆలోచించడం, వాస్తవానికి దగ్గరగా ఊహించడం, తర్కం, ఆప్టిట్యూడ్ లతో వ్యవహరించగలవారు ఈ రంగంలో రాణించవచ్చు. అకడమిక్ పరిజ్ఞానంతో పాటు సైన్స్‌కు చెందిన విభాగాల్లో అవగాహన ఉన్నవాళ్లు మరింత సమర్థవంతంగా రాణించడానికి అనువవ్వతుంది. సునిశిత పరిశీలన, విశ్లేషణ సామర్థ్యం ఈ రెండూ ఎంతో ముఖ్యం. కొన్నిసార్లు సునిశిత పరిశీలన ఉన్నవాళ్లు ఈ కోర్సులో రాణించడానికి అవకాశాలు ఉన్నాయి.

అభ్యర్థి చదువ్వకున్న కోర్సును బట్టి ఫోరెన్సిక్ పాథాలజిస్ట్, క్రైమ్ ల్యాబొరేటరీ అనలిస్ట్, ఫోరెన్సిక్ ఇంజినీర్, ఫోరెన్సిక్ ఆర్కిటెక్ట్, ఫోరెన్సిక్ వెటర్నరీ సర్జన్, వైల్డ్ లైఫ్ ఫోరెన్సిక్ స్పెషలిస్ట్, ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్, ఫోరెన్సిక్ టాక్సికాలజిస్ట్, ఫోరెన్సిక్ అడోంటాలజిస్ట్, ఫోరెన్సిక్ సెరోలజిస్ట్.. తదితర హోదాల్లో ఫోరెన్సిక్ నిపుణులు బాధ్యతలు నిర్వర్తిసారు. ప్రభుత్వ ప్రైవేటు ఏజెన్సీలు, ఆసుపత్రులు, ల్యాబొరేటరీల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఎంచుకున్న స్పెషలైజేషన్‌పై అవకాశాలు ఆధారపడి ఉంటాయి. కొన్ని కార్పొరేట్ సంస్థలు ఫోరెన్సిక్ నిపుణులను డాక్యుమెంట్ రైటర్లుగా నియమించుకుంటున్నాయి. యాంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్, మాస్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ వంటి విభాగాల్లో అవకాశాలు లభిస్తాయి. సెం ట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ), ఇంటెలెజెన్స్ బ్యూరో, పోలీస్ శాఖల్లో ఫోరెన్సిక్ ఉద్యోగాలు ఉంటాయి. ఫ్రీలాన్సర్‌గా రాణించడానికి రాష్ట్రానికి చెందిన ఫోరెన్సిక్ విభాగం నుంచి సర్టిఫికేషన్ తీసుకోవాలి.



## శిశువుల పోషకాహారం పశువుల దాణాగా బాలామృతం

**- అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం**

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 23, ప్రభాతవార్త:**




రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆధ్వ ర్యంలో జరుగుతున్న ఐసీడీఎస్ పథకం ద్వారా చిన్న పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండాలని ఆరి ఎదుగుదలకు ఏది అడ్డం కాకూడదని మెరుగైన పోషకాహా రాన్ని అందించాలనే లక్ష్యంతో అనేక పోషకాలు కలిగిన బాలమృతాన్ని పంపి ణీ చేస్తున్నారు. దీనికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ఈ బాలమృతంలో ప్రధానంగా గోధుములు, శనగ పప్పు, పాలపొడి, నూనె పంచదార ఉంటాయి. ఇది పిల్లలకు పోషకాహా రాన్నిస్తుంది. ఇంకా అవసరతో ఇనుము, కాల్షియం, విటమిన్లు ఇతర ఆర్డీఏలను అందిస్తుంది. దీనిని పిల్లలకు సిఫార్సు మేరకు వంద గ్రాములు రోజుకు మూడు నుంచి 5 సార్లు ఇవ్వాలి. ఏడాదిలోపు పిల్లలకు వేడి నీళ్లలో వేసి పాయసంలా తినిపించాలి. కొంచెం పెద్ద పిల్లలకు లడ్డులా తయారు చేసి తినిపించాలి. శిశు సమగ్రాభివృద్ధి సంస్థ ద్వారా ఒక్కొక్క పిల్ల వాడికి నెలకు 2.5 కేజీల ప్యాకెట్ పంపిణీ చేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఒక రోజు నుంచి 7 నెలల ఓ ఇల్లాలుకు, మూడు సంవత్సరాల మధ్య పిల్లలకు టేక్ హోం రేషన్ ద్వారా అందిస్తారు. ప్రతి నెల 1వ తేదీ న్యూట్రిషన్ డేగా ప్రకటించారు. బాలామృతంతో పాటు ఫుడ్ మోడల్‌గా గుడ్లు అందిస్తారు. పిల్లల కోసం ప్రభుత్వం అందించే ఈ బలమైన పోషకాహారం పిల్లలకు దక్కకుండా కొందరి స్వార్థంతో కొద్దిపాటి డబ్బులు కక్కుర్తి వలన పదవులకు దాణాగా మారుతుంది. కడప జిల్లా విషయానికొస్తే జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2212 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటి పరిధిలో 1.43లక్షల మంది చిన్నారులకు బాలా మృతాన్ని అందించాలి. అయితే కొన్ని ప్రాంతాల్లో అధికారులు, వర్కర్లు కుమ్మక్కై లాలూచీ పడి బాలామృత ప్యాకెట్లు పశువుల దాణాకు అమ్ముకుంటున్నట్లు ఫిర్యా దులు వస్తున్నట్లు సమాచారం. అవన్నీ పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని అనుకోవచ్చు. అందరూ ఇలా అవినీతికి పాల్పడు తున్నారని అనుకోవాల్సిన అవసరం లేదు. కొందరు మాత్రం పాల్పడుతున్నారు. అర్బన్ ఏరియాలో తక్కువగా రూరల్ ఏరియాల్లో ఎక్కువగా అది కూడా రాజకీ య అండతో జరుగుతోందని సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొ ని నిర్లక్ష్యధోరణి వీడి పర్యవేక్షించి చిన్నారుల పోషకాహారమైన బాలామృతాన్ని పశువుల దాణాగా మారకుండా చేయాల్సిన బాధ్యత ఎంతో ఉంది.

## మీ ఆదరణకు రుణపడి ఉంటా

**టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ్‌నాయుడు**

**పెనగలూరు, అక్టోబరు 23 ప్రభాతవార్త:**




తిరుణంపల్లె ప్రజలు చూపిన ఆదరణకు రుణపడి ఉంటానని రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ కస్తూరి విశ్వనాథ్‌నాయుడు అన్నారు. మండలంలో ని కొండూరు పంచాయతిలో ఆదివారం బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వ హించారు. అందులో భాగంగా తిరుణంపల్లె దళితవాడ, తిరుణంపల్లెలో పలు వీధుల్లో ఇంటింటికి వెళ్లి బాదుడే బాదుడు కార్యక్రమంలో పలువురికి కరపత్రాలు ఇచ్చి ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పడుతున్న ధరలు, తదితర విషయాలపై క్షుణ్ణంగా తెలియజేశారు. అనంతరం తిరుణంపల్లెలో వెంకటేశ్వర్లు, చంద్రల ఆధ్వ ర్యంలో మండల టిడిపి ఇన్‌ఛార్జి ఇ.నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన స మావేశంలో కస్తూరి, మాజీ శింగనమల సర్పంచ్ యానాదయ్య,వై.కోటకు చెందిన అడ్వకేట్, మాజీ ఎంపిపి నాగరాజులు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం కచ్చితంగా జరగబోయే ఎన్నికల్లో కైవసం చేసుకొంటుందన్నారు. అందులో భాగంగా పార్టీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు 2 సంవత్సరాల నుండి ప్రజలకు ఏవిధంగా ఫలాలు అందిస్తే ప్రభుత్వం తీసుకురాగలం అనే ఉద్దేశ్యంతో 4 శాఖలుగా విభజిం చి నియోజకవర్గం ఇన్‌ఛార్జిలతో మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గడికోట సుబ్బరాయుడు, సికె(కృష్ణమనాయుడు), కస్తూరి కోటేశ్వర్‌నాయుడు, నియోజకవర్గం ఎస్‌సిసెల్ అధ్యక్షుడు ఎర్రతోటి సురేష్, అనితాదీప్తి, మండల అధ్యక్షులు కొత్త బాలకృష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యులు షామీర్‌బాషా, గొబ్బూరు రెడ్డయ్యరెడ్డి, తెలుగు యువత పుచ్చకాయల రవికుమార్, మాజీ సర్పంచులు కట్టావారిపల్లె నాగేశ్వర్‌రావు, నారాయణెల్లూరు మల్లయ్య, కొరముట్ల వెంకటసు బ్బయ్య, మండలంలో అన్ని పంచాయతిల్లో మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి లు, నియోజకవర్గంలో పలువురు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వలీమా కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల

**వాల్మీకిపురం,అక్టోబర్ 23 :ప్రభాతవార్త**



ఆదివారం స్థానిక షాధిమహల్‌లో పట్టణానికి చెందిన ముస్లిం వధువరుల వలీమా కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు. హసన్ ఖాన్ వీధిలోని ముస్లిం నాయకుడు రఫీ కుమారుడు అజామ్ బాష,నాయక్‌వీధి మహమ్మద్ బాష కుమార్తె పూరే రెష్మి వధువరులను ఆశీర్వదించారు.వారి కుటుం బ సభ్యులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలోఎన్‌టిఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.కృష్ణమూర్తి,మైనార్టీ నాయకులు అబ్దుల్ కలీమ్,చికెన్ మస్తాన్,సైఫుల్లా,వగళ్ల సర్పంచ్ కొండారెడ్డి,ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చండీ హోమం

**ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 23, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరులో రూరల్ పరిధిలో ఉప్పరపల్లె ఆశ్రమంలో నేడు ఉదయం 9 గంటలకు బహుళ చతుర్దశి సందర్భంగా చండీ హోమం నిర్వహించడం జరుగుతుందని కావునా భక్తాదులందరూ పాల్గొని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులగుదురని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

## లా పరీక్ష ఫలితాలతో విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరం : ఎస్ఎఫ్ఐ

**జమ్మలమడుగు, అక్టోబరు 22, ప్రభాతవార్త:**



వైవీయూ న్యాయ విద్య పరీక్ష ఫలి తాల్లో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా సహాయ కార్యదర్శి ఎ.వినయ్‌కుమార్ ఆర్అండ్‌బీ అతిథి గృహ సమావేశంలో తెలిపారు. ఈ సం దర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ వైవీయూ అధికారుల వ్యవహార శైలితో న్యాయ విద్య చదివే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నదన్నారు. శనివారం వదిలిన 3, 5 సంవత్సరాల మొ దటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు దారుణంగా వదలారన్నారు. కనీసం 20% కూడా పాస్ పర్సంటేజ్ ఉందంటే ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. దాదాపు 400 మంది పరీక్ష రాస్తే అందులో 90 మందే పాస్ అయ్యారన్నారు. 5 సంవత్సరాల వారు 130 మంది దాకా రాస్తే కనీసం 30 మంది కూడా ఉత్తీర్ణత కాలేదన్నారు. ప్రతి ఏడాది ఇఆగే జరుగుతున్నదన్నారు. విద్యార్థులకు ఇంటర్నల్ పరీక్షలు, సెమిస్టర్ కలిపి కనీసం ఎన్నో కొన్ని మార్కులు రావాలి కానీ యూనివ ర్శిటీ తతీరుతో చాలా మందికి 2, 1, 0 మార్కులు వేయడం జరిగిందన్నారు. యూనివర్శిటీ పేరుతో విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. యూనివర్శిటీ పరీక్ష పేపర్లను విద్యార్థులకు ఉచితంగా రీవాల్యుయేషన్ చేయించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు. యూనివర్శిటీ కనీసం సప్లిమెంటరీ కూడా నిర్వహిం చడం లేదన్నారు. వైవీయూ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నామని లేకుంటే న్యాయ విద్య చదివే వారితో కలిసి పోరాటం చేస్తామన్నారు.కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేంద్ర, నరసింహా, దిలీప్‌లు పాల్గొన్నారు.

## ఈనెల 26న మంగళగిరి మైనార్టీ కార్యాలయంలో వినతులు స్వీకరణ

**రాష్ట్ర మైనార్టీ కమీషన్ ఛైర్మెన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్**

**పీలేరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త :**



రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలు వివిధ రకాల పెండిగ్‌లోని సమస్యలను వినతిలచే స్వీకరించడమే కాకుండా ఈనెల 26న మంగళగిరి రాష్ట్ర మైనార్టీ కమీషన్ కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అర్జీలు స్వీకరించి వాటిపరిష్కారంకు మార్గం చూపుతామని డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ మైనార్టీ కార్పోరేషన్ బాధ్యతలు తీసుకొన్నప్పటినుంచి సిఎం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పర్యటించి ముస్లిం సమస్యలు తెలుసకోవడమే కాకుండా వాటి పరిష్కా రంకు కృషి చేస్తున్నామని అదే విధంగా ఈ మధ్యకాలంలో శ్రీకాకుళంలో పర్య టించి వారి సమస్యలను పరిష్కరించామన్నారు. ఈనెల 26న మంగళగిరి మైనార్టీ కార్పోరేషన్ కార్యాలయంలో అర్జీలు స్వీకరించడం జరుగుతుందని వాటి పరిష్కారంకు చర్యలు చేపట్టి ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్ళతామన్నారు. ఈ అవకాశాన్ని రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలు, క్రైస్తవులు, బౌద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## వాల్మీకి బోయలను ఎస్‌టిలో చేర్చితే సహించం

**రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షులు కోనేటి పరుసురామ్**

**పీలేరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త :**



రాష్ట్రంలో ఆర్థికంగా, సా మాజికంగా బలపడిన బోయ వాల్మీకులను రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌టి జాబితాలో చేర్చితే స హించేది లేదని రాష్ట్ర గిరిజన సమాఖ్య ఆర్‌జిఎస్ అధ్యక్షులు కోనేటి పరుసురామ్ తెలిపారు. ఆదివారం స్థానిక కేవిఆర్ పంక్షన్‌హాలులో ఏర్పా టు చేసిన ఎస్‌టి కులాల సమాఖ్య సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన పరు సురామ్ మాట్లాడుతూ అటవీప్రాంతాల్లో దుర్గంధ జీవితం గడపి ఆర్థికంగా వెనుక బడి సాధక బాదలతో సమస్యల వలయంలో చిక్కుకొని ఇప్పుడిప్పుడు ఎదుగుతు న్న ఎస్‌టి కులాలను అణిచివేసేందుకే వాల్మీకిబోయలను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి ప్రభుత్వం సిద్ధం అవడం బాదాకరవిషయమని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఆర్‌జివి నాయకులు బండిరమణ, మాజీ జడ్పిటిసి జయరామచంద్రయ్య, ఎల్లప్ప, వెంకటరమణ, గుణ, కుమార్‌లు పాల్గొన్నారు.

## రాయచోటి రాంప్రసాద్ రెడ్డిని కలిసిని చింతపర్తి టిడిపి నాయకులు

**వాల్మీకిపురం,అక్టోబర్ 23 : ప్రభాతవార్త**



ఆదివారం రాయచోటి మాజీ ఎమ్మెల్యే నారాయణ రెడ్డి కుమారుడు టిడిపి పార్టీ నాయకుడు రాంప్రసాద్ రెడ్డిని చింతపర్తి తెలుగుదేశం పార్టీ నాయకులు కలి శారు.ఆయన దివంగత మాజి డిసిసి బాంకు సభ్యుడు,మాజీ సర్పంచ్ కొండెక్కి గారి కేశవ రెడ్డి స్వగృహానికి విచ్చేశారు.ఈ సందర్భంగా కుంటుంబ సభ్యులను నరసింహారెడ్డి కలశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భర్త శేషాద్రి రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి,సురేష్‌తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి చరిత్ర తిరగరాసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

**- తంబళ్లపల్లెలోనే ప్రభుత్వ డాక్టర్ల మకాం**

**తంబళ్లపల్లె, అక్టోబరు 23, ప్రభాతవార్త:**



గత మూడు దశాబ్దాల క్రితం తంబళ్లపల్లె టీఎన్ కుటుంబీకుల సహకారంతో నిర్మించిన ప్రభుత్వ ఆసుప త్రి వేలాది మందికి వైద్య కేంద్రంగా నిలిచింది. అప్పట్లో డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రభుత్వాసుపత్రిలోని క్వార్టర్స్ లో కాపురాలుండి మారుమూల గ్రామాల నిరుపేద రోగులకు రేయింబవళ్ల వైద్య సేవలు చేసి మంచి పేరు సంపాదించారు. అయితే ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంగా ఉన్న ఆసుపత్రి స్థాయి పెరిగి నేడు సామాజిక ఆరోగ్య కేంద్రంగా మారినా సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతూ ఉండేది. ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది లేకపోవడంతో పలువురు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడిన సంఘటనలు కోకొల్లలు. ప్రతి రోజు 300 మంది, సోమ గురు వారాలైతే 350కి పైగా ఓపీ రోగులతో పాటు పదుల సంఖ్యలో అత్యవసర కేసులు డెలివరీ కేసులు వస్తుంటాయి. గత పాలకులు ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై దృష్టి సారించకపో వడంతో సమస్య జటిలమైంది. ఈ సమస్యను స్థానిక వైకాపా నాయకులు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే తీవ్రంగా స్పందించారు. నా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రతి ఒక్క నిరుపేదకు సకాలం లో వైద్యం అందాలని ఆకాంక్షించారు. వెంటనే తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి డాక్టర్ల నియామకంతో పాటు 24 గంటల వైద్యం అందించి నిరుపేద రోగులకు సేవ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా రాత్రి సమయంలో డాక్టర్ల సమస్య గుర్తించి ఇరువురి డాక్టర్లు తంబళ్లపల్లెలోనే కాపురాలు ఉండి సేవ చేయా లని హుకుం జారీ చేశారు. అదే విధంగా రాత్రి సమయంలో డాక్టర్ల సమస్య గుర్తించి ఇరువురు డాక్టర్లు తంబళ్లపల్లె మండల కేంద్రంలో నివాసాలు ఏర్పాటు చేసుకొని రోగులకు అందుబాటులో ఉండడం విశేషం. మూడు దశాబ్దాలుగా ఎన్నో ప్రభుత్వాలు, ఎంతో మంది నాయకులకు ఈ సమస్యపై మొరపెట్టుకున్నా పట్టిం చుకోకపోవగా ఎమ్మెల్యే ఈ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించడంతో స్థానిక వైద్య సిబ్బందితో పాటు మారుమూల గ్రామాల ప్రజలు, వైకాపా నాయకులు పెద్దఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రూ.లక్ష విలువ చేసే కోళ్ళు చోరీ

**మదనపల్లెక్రైం, అక్టోబర్ 23 ప్రభాతవార్త :**

మదనపల్లె రూరల్ మండలం పోతబోలుకు చెందిన భాస్కర్ హోల్‌సేల్ కోళ్ళను విక్రయించుకొని జీవనం పొందేవాడు. ఇదే క్రమంలో భాస్కర్ హోల్‌సే ల్‌గా బ్రాయిలర్ కోళ్ళను ఆయా షాపులకు కోళ్ళను అన్‌లోడ్ చేసి వెళ్ళిపోయా డు. అయితే అవి తమకు కోళ్ళు రాలేదని ఆ షాపు దుకాణయజమానులు భాస్కర్‌కు పోన్ చేయడంతో చోరికి గురైనట్లు బావించారు. ఈ కోళ్ళు దాదాపు రూ.లక్షవరకు ఉంటాయని పోలీసులకు పిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలపారు.

## వాల్మీకిబోయలను ఎస్టీ పునరుద్ధరించడంపై హర్షం

**విఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందు**

**మదనపల్లె, అక్టోబర్ 23 ప్రభాతవార్త :**




వాల్మీకిబోయలను ఎం టి జాబితాలో పునరుద్దరిం చడానికి ప్రభుత్వం కమీషన్ నియమించడం హర్షనీయమ ని విఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధి కార ప్రతినిధి నాగినేని గోవిం దు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్ నందు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర నాయకులు గంపల గంగరాజు, మేకల విజయమోహన్, జిల్లా కార్యదర్శి లక్ష్మన్న, నియోజక వర్గ అధ్యక్షులు పులిశ్రీనివాసులు మాట్లాడుతూ వాల్మీకి బోయలను ఎస్‌టి జాబి తాలోని కులాలు వ్యతిరేకించడం ఎంతవరకు సమంజసమన్నారు. వాల్మీకిబోయ లను ఎస్‌టిలో చేర్చడం మిగిలిన కులాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కమీషన్ ఏర్పాటు చేసి వాల్మీకి బోయల పట్ల చిత్తశుద్ది నిరూపించుకోవడం హర్షనీయమన్నారు.

## శ్రీక్రిష్ణదేవరాయ విగ్రహ ప్రతిష్ట కార్యాచరణ కమిటీ ఎన్నిక

**కాంస్య విగ్రహాన్ని బహకరించనున్న ఎంపి మిథున్‌రెడ్డి**

**మదనపల్లె, అక్టోబర్ 23 ప్రభాతవార్త :**



మదనపల్లె పట్టణంలోని స్థానిక బలిజ సేవాసమితి కా ర్యాలయంలో ఆదివారం నాలు గు నియోజకవర్గాలకు చెందిన బలజ కులస్థులు సమావేశం అయ్యారు. ఈ సమావేశం మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా వెంకటాచలపతి ఆధ్యక్షతన జరిగింది. ఈ సమా వేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని పడమటి నియోజకవర్గా లైన పుంగనూరు, తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు బలిజల చిరకాల కోరిక నెరవేరేదిశగా అడుగులు పడ్డాయని తెలిపారు. ఈ సమావేశంకు ముఖ్య అతిధిగా పాల్గొన్న పోకల అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే నీతివంతమైన పరి పాలనాధ్యక్షులు, ఆంధ్రభోజుడిగా, సాహితీ సమరాంగణ సార్వభౌమునిగి కీర్తించబ డుతున్న శ్రీక్రిష్ణదేవరాయుల బలిజ జాతిలో పుట్టడం మనందరికి గర్వకారణమ న్నారు. ఆ మహనీయుని జయంతి, వర్థంతికి నిశాలుర్పించిన ఆయన మీద అభిమానాన్ని చాటుకోవాలన్నది చిరకాల కోరికగా మిగిలిపోయిందన్నారు. కుప్పం లో క్రిష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటు సందర్భంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డిల సహకారంతో సులువుగా పరిష్కరించుకుని విజయవంతంగా ప్రతిష్టించగలిగామన్నారు. పట్టణంలో విగ్ర హం ఏర్పాటుకు ఎంపి మిథున్‌రెడ్డి సహకరిస్తూ తనవంతుగా కాంస్య విగ్రహాన్ని వితరణ చేసేందుకు ముందుకువచ్చారన్నారు. స్థానిక ఎమ్మెల్యే నవాజ్‌బాషా సహకారంతో విగ్రహ ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసి వీలైనంత త్వరగా స్థాపన జరపాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సేవాసమితి కార్యదర్శి భాస్కర్, మదనేశ్వర్, రామాంజులు, జంగాల శివరామ్, సూర్యనారాయణ, ఉదయ్‌కుమార్, శ్రీనివాసులు, మాజీ ఎంపిపి రెడ్డిప్రకాష్, జడ్పిటిసి ఉంగరాల శివన్న, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఆనంద పార్థసారధి, సర్పంచ్ బోల్‌వెల్ మహేస్, సిగింల్‌విండో డైరెక్టర్ వీరప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## మట్లివారిపల్లె గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

**సర్పంచ్ సోమిరెడ్డి**

**కురబలకోట, అక్టోబర్ 23 ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సహా య సహకారాలతో మట్లివారిపల్లె గ్రామ పంచాయితీని అన్ని విధాలుగా తీర్చిదిద్ది ఆదర్శవంతంగా ఉండేలా చూ స్తానని సర్పంచ్ నల్లపరెడ్డి సోమిరెడ్డి అన్నారు. మట్లివారి పల్లెలో రూ.9లక్షలతో సిసిరోడ్లు, మద్యాహ్న వారిపల్లెలో రూ.4లక్షలతో, గుడ్డిం డ్లవారిపల్లెలో రూ.5లక్షలతో సిసిరోడ్లు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఎర్రమ ద్దివారిపల్లెలో, మట్లివారిపల్లెలో రూ.2లక్షు చొప్పున డ్రైనేజి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వందమందికి వైఎస్ఆర్ ఫించన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. తూర్పురామిగానివారిపల్లెలో బిఎంసి (అమూల్)పాల సెంటర్‌ను ఏర్పాటు చేసిన ట్లు తెలిపారు. రూ.2లక్షల వ్యయంతో గ్రామ పంచాయితీ పరిధిలోని ఎల్ఈడి వీధి దీపాలు పల్లెల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.80లక్షలతో గ్రామ సచి వాలయం, వెల్‌నెస్‌సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆర్‌బికె సెంటర్‌ల నూతన భవనాలు నిర్మించినట్లు తెలిపారు. గుడ్డిండ్లవారిపల్లె, మట్లివారిపల్లె, ఎర్రమద్దివా రిపల్లెలో బోరు మోటార్లకు రూ.2లక్షల వ్యయంతో ఏర్పాటు చేసి మంచినీటిసమ స్యను పరిష్కరించినట్లు సర్పంచ్ తెలిపారు. ఎర్రమద్దివారిపల్లె నుంచి కమ్మగోవిం దుపల్లె మీదగా రెడ్డికోట వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వైస్ ఎంపిపి రమణారెడ్డి గ్రామాభివృద్దికి తమవంతు సహకరించినట్లు తెలిపారు.

## ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**పీలేరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పిఎం ఉపాధి కల్పన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వాణిదర్‌రామన్ తెలిపారు. పీలేరు స్త్రీశక్తి భవన్‌లో ఆయన మాట్లాడుతూ పథకం లక్ష్యాలు, అర్హతలు ధరఖాస్తు చేసుకునే విధానం దరఖాస్తుదారులకు లభించే వాటిపై వివరించారు. కేంద్ర సూక్ష్మ మంత్రిత్వంశాఖ అందిస్తున్న ఈపథకం ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు స్థాపనకు సాయం అందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ వృత్తి వారికి, పట్టణాల్లో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకం లభించడమే పతకం ముఖ్య ఉద్దేశమన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో కంటి ఆపరేషన్లు ప్రారంభం

**డాక్టర్ ప్రసాద్‌రాజు**

**మదనపల్లెక్రైం, అక్టోబర్ 23 ప్రభాతవార్త :**



ప్రభుత్వాసుపత్రిలో కంటి ఆపరేషన్లు ప్రారంభించినట్లు డాక్టర్ ప్రసాద్‌రాజు, సుబహానీ లు తెలిపారు. కంటిలో శుక్లా లు ఉన్న, కంటిచూపు మంద గించిన వారు ప్రభుత్వ ఆసుప త్రిలోనే కంటి విభాగానికి వస్తే పరీక్షలు చేయడం జరుగుతుం దన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుం దన్నారు. గతంలో డాక్టర్ శ్రీరాములు ఉన్నప్పుడు ఇలాంటి ఆపరేషన్లు నిర్వహించే వారని ఆయన బదిలీ కావడంతో ఆపరేషన్లు ఆపివేశామన్నారు. తిరిగి తనతో పా టు డాక్టర్ సుభహాని విధుల్లో చేరడంతో కంటి ఆపరేషన్ల ప్రక్రియను తిరిగి ప్రారంబించామన్నారు. ఈ సేవలను రోగులు వినియోగించుకోవాలని ఆప్తాలమిక్ టెక్నిషియన్ ఆజాద్ కోరారు.

## మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

**మదనపల్లెక్రైం, అక్టోబర్ 23 ప్రభాతవార్త :**

మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకొన్న సంఘటన ఆదివారం మదనపల్లె రూరల్ మండలంలో చోటు చేసుకొంది. పోలీసులు కథనం మేరకు పోతబోలు పంచాయితీ శానిటోరియం సమీపంల్లోఇ తురకపల్లెకు చెందిన చంద్రశేఖర్(55) మద్యానికి బానిసై తరచూ కుటుంబలో గొడవలు జరిగేవి. ఈ క్రమంలో మద్యం తాగిన చంద్రశేఖర్ మత్తులో ఇంటిలోనే కొయ్యకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పా ల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు బాధితున్ని మదనపల్లె జిల్లా ఆసుప త్రికి తరలించడగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇతనికిభార్య, కుమార్తెలు కలరు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జగనన్న క్రీడా సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

**మదనపల్లె, అక్టోబర్ 23 ప్రభాతవార్త :**



మదనపల్లె యూత్ కరాటే క్లబ్‌లో జగనన్న క్రీ డా సంబరాల పోస్టర్‌లను ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, జి ల్లా కోచ్ షేక్‌షఫి, కరాటే కోచ్ ఏఆర్.సురేష్‌లు ఆవి ష్కరించారు. ఈ సంద ర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ స్పోర్ట్స్‌లను ప్రోత్సహించే దిశగా క్రీడా ప్రాదికార సంస్థ పనిచేస్తుందని, యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని చూపించాలని తెలిపారు. ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని కబడి, బాట్‌మెంటన్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. డిసెం బర్ 21న విజయవాడలో ఫైనల్స్ జరుగుతాయని ఆసక్తిగల క్రీడాకారులు అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో యూత్ కరాటే క్లబ్ కార్య దర్శి మణిసాయి, సీనియర్ కరాటే మాస్టర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైలుకిందపడి గుర్తుతెలియని యువతి మృతి

**కురబలకోట, అక్టోబర్ 23 ప్రభాతవార్త :**

తుమ్మనగుంట, కురబలకోట రైల్వేస్టేషన్‌ల మధ్య బయ్యారెడ్డిగారిపల్లెకు సమీపాన గుర్తుతెలియని యువత రైలు కిందపడి మృతి చెందిన సంఘటన ఆది వారం జరిగింది. గుంతకళ్ళు నుంచి తిరుపతి వెళ్ళే ప్యాసింజర్ రైలు కింద గుర్తుతెలియని యువతి(30) పడి మృతి చెందింది. మృతదేహం చిందరమై గుర్తు పట్టలేని విధంగా పడిఉంది. కదిరి రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మైనారిటీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు - ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ**





**బద్వేలు, అక్టోబరు 23 ప్రభాతవార్త :**

ముస్లిం మైనారిటీల అభివృద్ధి కొరకు ముఖ్యమం త్రి జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే డా॥ సుధ, ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి అన్నారు. శనివారం బద్వేలు మున్సిపా లిటీ పరిధిలోని మాస్క్ కమిటీ ఆధ్వర్యంలో ఫాతిమా మసీదు ఆవరణంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్య క్రమాలలో ఎమ్మెల్యే డా॥ సుధ, ఎమ్మెల్సీ డి.సి.గో విందరెడ్డి పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని, యువతలో నైపుణ్యతను పెంపొందిం చేందుకై కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని, అంబులెన్స్‌ను ప్రారంభించడంతో పాటు కాంప్లెక్స్ నిర్మాణానికి శం ఖు స్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా॥ సుధ, ఎమ్మెల్సీ డి.సి.గోవింద రెడ్డి మాట్లాడుతూ మైనారిటీలలో ఉండే పేద కుటుం బాలకు ఆసరాగా ఉండేందుకు ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంతో మంది నిరుద్యోగులుగా ఉన్నార ని, వారందరిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు కంప్యూటర్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం, దీని ద్వారా వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇదొక నాందిగా భావించవచ్చని వారన్నారు. ఆరోగ్య రీత్యా ఎక్కడైనా దూర ప్రాంతాలలోని ఆసుపత్రులకు వెళ్ళి చూపించుకునేందుకు సౌలభ్యం కొరకు అంబులెన్స్‌ను కూడా మైనారిటీలకు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ ఉచి తంగా సేవలందించడం గొప్ప విషయమని పేర్కొన్నా రు. ఇదిలా ఉంటే ప్రభుత్వం అన్ని రకాలుగా మైనారి టీల అభివృద్ధి కొరకు పాటుపడడమే గాక మైనారి టీలను దృష్టిలో ఉంచుకొని అనేక పథకాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొదటగా దివం గత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముస్లీం మైనారిటీల కోసం రిజర్వేషన్ కల్పించిన ఘనత వా రికే దక్కిందన్నారు. వారి తనయుడు, నేటి ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి మైనారిటీల పట్ల చూపు తున్న ఆదరాభిమానాలు ఎనలేనివని, వాటికి నిదర్శ నాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. పేద ముస్లీంల వివాహాల కొరకు దుల్హన్ పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థికం గా ఆదుకోవడం జరుగుతుందన్నారు. షాదీఖానాలకు స్థలాలు లాంటి అభివృద్ధి, అలాగే మసీదులలో ఉండే మత పెద్దలకు వేతనాలు, మసీదుల అభివృద్ధి లాంటి అనేక కార్యక్రమాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఏపీ టూరిజం కార్పోరేషన్ డైరెక్టర్ అల్లా బకాష్, మార్కెట్ యార్డు ఛైర్మెన్, పుత్తా శ్రీరాములు, మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగో పాల్ రెడ్డి, సివిల్ సప్లయ్స్ కార్పోరేషన్ డైరెక్టర్ సుం దరరామి రెడ్డి, వైసీపీ నాయకులు బంగారు శీనయ్య, సింగసాని శివయ్య, వైసీపీ పశ్చిమ కన్వీనర్ యద్దారె డ్డి, వైసీపీ నాయకులు ఉమ్మర్, షంషీర్ (తాజ్), సరి టాల మౌలాలి, ఫ్రూట్స్ షఫి, 23వ వార్డు కౌన్సిలర్ కరిముల్లా,పలువురు ముస్లీం మైనారిటీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ము స్లీం మైనారిటీల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని విదేశీ విద్య, దుల్హన్ పథకం, ఉచిత హాస్టల్ వసతి, పోస్ట్‌మె ట్రిక్ హాస్టల్, ఉర్దూఘర్ కం షాదీఖానాలు లాంటి అనేక సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత ఒక్క వైఎస్సార్ పార్టీకే దక్కిందని, మైనారిటీ విద్యావంతుల కు విదేశీ విద్య ద్వారా విదేశాలలో విద్యనభ్యసిం చుటకు చక్కటి అవకాశం కల్పించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. అనంతరం బద్వేలు మాస్క్ కమి టీ వారిని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అభినందించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులను మాస్క్ కమిటీ ఆధ్వ ర్యంలో సత్కరించారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్లు యర్రగొల్ల గోపాలస్వామి, రాచపూడి సాయి కృష్ణ, వైసీపీ నాయకులు రాగిమాను ప్రతాప్ కుమా ర్, మహబూబ్ సాహెబ్ (బీమా), 13వ వార్డు కౌన్సి లర్ మహమ్మద్ హసాన్, షరీఫ్, మహబూబ్ బాష, గౌస్ బాష, మున్సిపల్ మాజీ ఛైర్మెన్ డా॥ మునె య్య, పంగా చెన్నకృష్ణా రెడ్డి, మున్సిపల్ కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డి, హుస్సేన్, వంకెల పోలిరె డ్డి, రంతుల్లా బాబు, చాన్‌బాష, అల్తాఫ్, మహబూ బ్, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ బొప్పాయ నర్సరీలతో అల్లాడుతున్న రైతన్నలు

**చిట్వేలి, అక్టోబర్ 23 ప్రభాతవార్త**



బొప్పాయ అంటేనే రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలి మండలంతో సహా నకిలీ నర్సరీల యజమానులు, దళారీలు, వ్యాపారులు బొప్పాయ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. తైవాన్ రెడ్‌లేడి బొప్పాయ రకంనే రైతులు సాగు చేయడానికి ఆసక్తి చూపుతారు. ఈ విత్తనాలు ఎలా ఉంటాయో రైతులకు తెలియదు. వ్యాపారులు, నర్సరీల నిర్వాహకులు వారికిమాత్రమే అసలు కథ తెలుసు. కోడూరు నియోజకవర్గంలో హార్టికల్చర్ అనుమతి పొందిన బొప్పాయ నర్సరీలు రెండో మూడో ఉంటాయి. చిట్వేలి మండలంలో ఒక నర్సరి మాత్రమే అనుమతి పొంది ఉంది. కోకొల్లలుగా నకిలీ నర్సరీలు పుట్టుకొచ్చాయి. రైతుల వద్దకు వెళ్లి మొల కలు ఇస్తాం. కాయ కోస్తాం, మీరు సాగు చేయండని నమ్మ బలుకుతారు. ప్రతియేటా రైతులు నకిలీ మొలకల బెడద వేధిస్తూనే ఉంది. నకిలీ నర్సరీలు 2, 3 నెలలు మాత్రమే కనిపిస్తాయి. ఆ రెండు మూడు నెలలు అప్పటికప్పుడ కర్రలు నాటడం, మట్టి సంచుల్లో బొప్పాయ మొలకలు పెంచడం వ్యాపారులకు ఇవ్వడం వారు కొంతమంది రైతులకు ఇవ్వడం జరుగుతోంది. అంతే ఇక్కడే మెలిక తిరిగింది. గుడిసెమీద దెబ్బ వేసి నర్సరీ అడ్రస్సు లేకుండా తాత్కాలికంగా వేసిన షెడ్‌లు పెరికివేస్తారు. మొలకలు ఇచ్చినతను కనపడదు. వ్యా పారిని అడిగితే ఉన్న మొలకలేగా ఇచ్చాము అని చెప్పి చేతు లు దులుపుకొంటున్నారు. చిట్వేలి మండలంలోని గట్టు మీదపల్లె గ్రామానికి చెందిన అదే దారిలో ఉండే ఓ నకిలీ నర్సరీలో పెంచిన మొక్కలను రైతు వెంకటసుబ్బయ్యతో పాటు ఆయన అన్న సువ్వారపు సుబ్బరాయుడు మొక్కలు తెచ్చుకొని నాటుకొన్నారు. బొప్పాయ చెట్టు ఏపుగా పెరుగు తుందేకాని ఇప్పటికీ కాయలు లేకపోవడంతో లబోదిబోమం టున్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టేందుకు కూడ వెనుకాడబోమని, ఇటువంటివారిపై కఠినచర్యలు తీసు కోవాలని ఆ రైతులు కోరారు. ఒకటా.. రెండా సుమారు ఐదారు సంవత్సరాల నుండి ఇదే తంతు నడుస్తోంది. రైతు నష్టపోతున్నారే తప్ప దళారి వ్యవస్థను రూపుమాపేవారు లేరు. రెండు మూడు నెలలకు నర్సరీలు దర్శనమిస్తున్నా వాటిపై చర్యలు లేవు. నకిలీ విత్తనాలతో మొలకలు రైతులకు అంటగడుతున్నా అడిగే అధికారులే లేరు. బొప్పాయ మొలకలు రెండు నుంచి మూడు నెలల పాటే తాత్కాలిక నర్సరీల్లో ఏర్పాటు చేస్తారు. ఇదేవిధంగా కొనసాగితే ముప్పు తప్పదని రైతులు ఆందోళన చేపట్టే పరిస్థితి వస్తుందని రైతులు అంటున్నారు.



మైదుకూరు లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో జరిగిన కడప జిల్లా రైస్‌మిల్ ఓనర్స్ అసోషియేషన్ కార్యవర్గ సమావేశంలో జిల్లా కోశాధికారిగా ఎన్నికైన సూరిశెట్టి వెంకట గుప్తాను సన్మానించిన ఎలిశెట్టి దొంతు కృష్ణ కాంత్ - మైదుకూరు, ప్రభాతవార్త:

## భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీలకు బదిలీలలో ప్రాధాన్యత కల్పించాలి

### స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ కమిషనర్ ప్రతాప్‌రెడ్డికి వినతి

సంబేపల్లి, అక్టోబర్ 23 ప్రభాతవార్త :



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీలగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు త్వరలో జరగబోయే బదిలీల్లో అదనపు పాయింట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా సెక్రెటరీ మడితాటి నరసింహారెడ్డి ఆదివారం సాయంత్రం స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ కమిషనర్ బి. ప్రతాపరెడ్డికి రాయచోటిలో వినతి పత్రం అందజేశారు. బదిలీలలో అదనపు పాయింట్ల కేటాయించడం ద్వారా జిల్లా సెక్రట రీలకు జిల్లా కేంద్రాల్లో గాని, జిల్లా కేంద్రాలకు సమీపంలో ఉన్న పాఠశాలల్లో పని చేసే అవకాశం కల్పిస్తే స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను మరింత సమర్ధవం తంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంతేకాక రాష్ట్రంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయనకు విన్నవించా రు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ నాయకులు రెడ్డప్ప రెడ్డి, శివశంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు హరినాథ్, కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 26న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

రైల్వేకోడూరు, అక్టోబరు 23 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఈనెల 26న నిరుద్యోగులకు జాబ్‌మేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌ద్వారా మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ కార్యక్రమాన్ని రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరుగుతుందని అన్నారు.

## ప్రభాస్ జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు



కడప, అక్టోబర్ 23 ప్రభాతవార్త :

సినీ హీరో ప్రభాస్ 43 వ జన్మదిన సందర్భంగా ఆయన అభిమాన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధు రెడ్డి ,జిల్లా అధ్యక్షుడు రాజశేఖర రాజు ల ఆధ్వర్యంలో పలుచోట్ల కేక్ కటింగ్ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు నగరంలోని రాజా అప్సర థియేటర్లలో కేక్ కటింగ్, జడ్పీ ఆవరణం లోని ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహం లోని నిరాశల మధ్య కేక్ కటింగ్ అల్పాహారం మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో అభిమాన సంఘం గౌరవ అధ్యక్షుడు బాల శెట్టి హరిప్రసాద్, బాలాజీ హాస్పిటల్ అధినేత కృష్ణ కిషోర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సినీ హీరో ప్రభాస్ 43 సంవత్సరాల కాలం లో పలు సినిమాలు తీసి సినిమాలు విజయవంతమై అభిమానుల గుండెల్లో గూడు కట్టుకున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థాయి కి ఎదగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో అభిమాన సంఘం నాయ కులు శశి కుమార్, రవికుమార్, శివ, కలందర్, కాజా, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు

# ప్రమాదాలకు నెలువు హైవే రహదారి

## రోడ్డుపక్కనే చెత్తా చెదారం - అవి తినడానికి గుంపులు గుంపులు ఆవులు, పందులు ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలంటే భయం... భయం

నందలూరు, అక్టోబరు 23 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా నందలూరు మండలం కన్యకచెరువుపై ఉన్న కడప - రేణిగుంట జాతీయ రహదారి ప్రమాదాలకు అడ్డాగా మారింది. ఈ మధ్యకాలంలోనే ఎన్నో ప్రమాదాలు ఈ చెరువు కట్ట మీద జరగడం ఇందుకు నిదర్శనం. వివరాల్లోకి వెళితే కడప - రేణిగుంట జాతీయ రహదారి నందలూరు మండలం కన్యకచెరువుపై ఉన్నది. మండలంలో ఉన్నటువంటి కూరగాయల దుకాణదారులు, మాంసహార దుకాణదారులు వీటికితోడుగా పంచాయతివారు చెత్తను కుళ్లిపోయిన పదార్థాలను రోడ్డుపక్కనే వేస్తుండడం ఈ ప్రమాదాలకు కారణంగా చెప్పవచ్చు. కూరగాయల దుకాణదారులు కుళ్లిపోయిన టమోటాలు, కూరగాయలు తీసుకొచ్చి రోడ్డుపక్కన చెట్లవద్ద వేసి వెళుతుండడం, చికెన్, మాంసాహార దుకాణాలవారు కలేబరాలను తీసుకొచ్చి ఇక్కడే వేస్తారు. మేమేం తీసిపోమంటూ పంచాయతిలో సేకరించిన చెత్తను ఆల్విన్ కర్మాగారం వద్ద గుట్టలు గుట్టలుగా గ్రామాల్లో సేకరించిన చెత్తను వేస్తారు. ఈ చెత్తను వేస్తే ఏమవుతుందిలే అనుకోవడం సహజం.. ప్రమాదాలకు ఇదే అడ్డాగా ఉందని ఎవరూ ఊహించలేకపోతున్నారు. ఇక్కడున్న ఈ చెత్తను ఆవులు, గేదెలు, పందులు వచ్చి తినే ప్రయత్నంలో ఒకదానిని ఒకటి తోచుకొంటూ తరుముకొంటూ రోడ్డుపై వస్తున్న ద్విచక్ర వాహనాల వారిని భయందోళనకు గురి చేస్తున్నాయి. వీటిపై సంబంధిత అధికారులు కాని, నాయకులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ద్విచక్ర వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి వాహనదారులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణాలు చేస్తున్నారు.



రోడ్డు పక్కన ఉన్న చెత్తా చెదారం

వాస్తవానికి ఇక్కడ వేసిన చెత్తను కూరగాయలు తినడానికి జంతువులు వెళుతున్నాయి తప్ప చెత్తా చెదారం లేకపోతే అక్కట ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రయాణికులు అంటున్నారు. ఇందుకు ఉదాహరణ రెండు రోజుల క్రితం బైకుపై వెళుతున్న వారికి ఆవు ఎదురుగా వచ్చి బైకును ఢీకొన్న ప్రమాదంలో మహిళ కింద పడడం అదే సమయంలో ఆమెపై కారు వెళ్లి అక్కడక్కడే మృతిచెందిన సంఘటన పాఠకులకు విధితమే. ఈ విధంగా ఈ రహదారిలో ఆల్విన్ కర్మాగారం నుంచి బస్టాండ్ కూడలి వరకు ఎన్నో ప్రమాదాలు జరిగాయి. దీనికి ప్రధాన కారణం రోడ్డుపై వేస్తున్న చెత్తా చెదారాలేనని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా ఇక్కడ జరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## టపాకాయల దుకాణాలను పరిశీలించిన అడిషనల్ ఎస్‌పి రాజకమల్

రాజంపేట అర్బన్, అక్టోబరు 23 ప్రభాతవార్త



విజయవాడలో టపాకాయల దుకాణంలో పేలుడు సంభవించి ఇద్దరు సజీవ దహనం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర డిజిపి రాష్టవ్యాప్తంగా టపాకాయల దుకాణాల వద్ద ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు క్షేత్రస్థా యిలో దుకాణాలను పరిశీలించాలని ఆదేశించారు. దీంతో అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్‌పి రాజ్‌కమల్ ఆదివారం రాజంపేటలో టపాకాయల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రమాదాలు జరగకుండా తీసుకొన్న జాగ్రత్తలను పరి శీలించారు. తప్పనిసరిగా అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల ని, అగ్నిమాపకదళశాఖ అధికారులు ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్‌పి వెంట రాజంపేట డిఎస్‌పి శివభాస్కర్‌రెడ్డి, రాజంపేట అగ్ని మాపకదళ అధికారి శివశంకర్‌రెడ్డి, అర్బన్ ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## పశువులకు టీకాలు వేయించాలి : సర్పంచ్

వీరబల్లి.అక్టోబర్ 23 ప్రభాతవార్త



పశువుల యజమానులు లంపి చర్మవ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించాలని మట్లి సర్పంచ్ నాగార్జునా చారి కోరారు. ఆదివారం పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో లంపి చర్మవ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం సర్పంచ్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ఈ వ్యాధి వల్ల పశువులు అనారోగ్యానికి గురై చనిపోయే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పాలిచ్చే ఆవులు, గేదెలు ఈ వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గిపోతుందని పశు వైద్యశాఖ డాక్టర్ జయప్రకాష్ తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులకు నోరు నాసికాకుహారం కంటి నుంచి కారే స్రవంలో వైరస్ ఎక్కువ మోతాదులో ఉంటుం ది. ఈ వ్యాధి పశువులలో అంటువ్యాధి కావడంతో యజమానులు పశువులకు ఈ టీకాలు వేయించాలని డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో భూషణ నాయుడు, రమణయ్య, కేశవులు, వెంకటరమణ, చలపతి, నారాయణ రాజు, బాబు, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట, కోడి పందేం స్థావరాలపై మెరుపుదాడి

సంబేపల్లె.అక్టోబర్ 23 ప్రభాతవార్త

మండలంలో ఆదివారం పేకాట, కోడి పందెం స్థావరాలపై ఎస్ఐ ఎండి షరీఫ్ పోలీస్ సిబ్బందితో కలిసి మెరుపుదాడి చేశారు. సంబేపల్లె సమీపంలో జూదమాడుతున్న ఏడు మంది పేకాట రాయుళ్లను పట్టుకుని అరెస్ చేశారు. వారి వద్ద నుంచి 11640 రూపాయల నగదు స్వాదీనం చేసుకున్నారు. వీటితో పాటు 52 పేకాట కార్డులను స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. పిఎన్ కాలనీ గ్రామం నగిరి సమీపంలో కోడిపందెం ఆడుతున్న ఏడు మంది కోడి పందెంరాయుళ్లను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు 2430 రూపాయల నగదు స్వాదీనం చేసుకున్నట్లు తెలియజేశారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు.

## ఉరి వేసుకుని సచివాలయ ఉద్యోగి మృతి

సంబేపల్లె.అక్టోబర్ 23 ప్రభాతవార్త



మండల పరిధిలోని మోటకట్ల గ్రామం రోడ్డువారిపల్లి సమీపంలోని హంద్రీవా పిల్లకాలువ సమీపంలో ఆదివారం చెట్టుకు ఉరేసుకుని సచివాలయ ఉద్యోగి రణదీర్ నాయక్ (35) మృతి చెందినట్లు ఎస్ఐ ఎండి షరీఫ్ తెలిపారు. పోలీస్‌ల వివరాల మేరకు మండలం దేవపట్ల గ్రామం ఎస్టీ కాలనీకి చెందిన రణ ధీర్ నాయక్ బద్వేల్ సచివాలయంలో శానటరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు. మానసిక ఒత్తిడికి గురయ్యి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఇటీవల రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు గాని ప్రయత్నం చేసినట్లు తెలిపారు. మృతుడు 15 రోజులు మెడికల్ లీవ్ పొంది ఉన్నట్లు పోలీస్‌లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

## స్వాదీనం చేసుకున్న స్థలానికి రక్షణ వలయం ఏర్పాటు

రాయచోటి టౌన్.అక్టోబర్ 23 ప్రభాతవార్త



శ్రీభద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం సంబందించిన 15 సెంట్ల భూమిని అన్యాక్రాంతం కాకుండా జిల్లా కలెక్టర్ ఆదేశముల మేరకు రెవెన్యూ సిబ్బంది పోలీస్ అధికారుల పర్యవేక్షణలో భూమికి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ఇటీవల ఈ స్థలం కొందరు ఆక్రమించుకుని అనుభవించుకునేవారు. అయితే ఆల య అధికారులు పోలీస్ అధికారులు ఆక్రమణ తొలగించి దేవాలయానికి సంబం దించిన 15 సెంట్లు స్థలాన్ని స్వాదీనం చేసుకున్నారు. ఈ స్థలానికి ఆదివారం ఆలయ చైర్మన్ శ్రీమతి పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి పాలకమండలి సభ్యులు నాగభూషణం ఆలయ అర్చకులు కలిసి ఫెన్సింగ్ వేయిం చారు. ఆక్రమణ తొలగించి దేవాలయానికి భూమి తీసుకోవడం వల్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ భూములు ఇంకా చాలా చోట్ల అన్యాక్రాంత మవుతున్నాయని వాటిని కూడా స్వాదీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సర్వసభ్య సమావేశం

రాయచోటి.అక్టోబర్ 23 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం మదనపల్లె రోడ్‌లో జిల్లా కార్యాలయంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా అన్న మయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదు సంఘం బలోపేతం కొరకు చర్చిం చడం జరిగిందన్నారు. మహిళా ఉద్యోగుల సంఘం ఏర్పాటు కొరకు వివిధ శాఖల్లో ఉద్యోగుల సమస్యలపై ఒప్పంద ఉద్యోగుల క్రమబద్దీకరణ, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల మరియు ఈ నెల 30వ తేదీన అన్నమయ్య జిల్లా మొదటి జిల్లా ప్రధమ కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు చర్చించడం జరిగిందన్నారు. ఉద్యోగస్తులను అధిక సంఖ్యలో సమావేశానికి తీసుకుని రావల సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఈ సమావేశాన్ని జయప్రదం చేయుట కొరకు చర్చించడం జరిగినదని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు అన్నమయ్య జిల్లాలోని అన్ని తాలూకాల అద్యక్ష , కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

## మేదరపల్లెలో మల్లాలమ్మ తల్లి బోనాల జాతర

రామాపురం.అక్టోబర్ 23 ప్రభాతవార్త



మండలంలోని కసిడిగారిపల్లె పంచాయతీ మేదరపల్లెలో ఆదివారం మల్లమ్మ తల్లికి బోనాల జాతరను మహిళ లు ప్రజలు ఘనంగా జరుపు కున్నారు. ఉదయం నుంచి మహిళలు భక్తి శ్రద్దలతో ఉపవాసాలతో బోనాలు తీసుకుని భజంత్రీ లతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలు తలపై పెట్టుకుని భజంత్రీలు మధ్య ఆలయం వద్దకు చేరుకుని ఆలయంలో అమ్మవారికి పూజలు చేసి తమ కోరికలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైస్‌మిల్ ఓనర్ల అసోషియేషన్ కొత్త కార్యవర్గం



అసోషియేషన్ కొత్త కార్యవర్గాన్ని సత్కరిస్తున్న దృశ్యం.

మైదుకూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త :

కడప జిల్లా రైస్‌మిల్ ఓనర్ల అసోషియేషన్ కొత్త కార్యవర్గాన్ని ఆదివారం మైదుకూరులో ఎన్నుకున్నారు. కొత్త అధ్యక్షుడిగా జి.చంద్రశేఖర్ (ప్రొద్దుటూరు), ఉపాధ్యక్షుడుగా కరిముల్లా (ఖాజీపేట), కార్యదర్శిగా వినయ్‌కుమార్ రెడ్డి (చాపాడు), కోశాధికారిగా సూరిశెట్టి ప్రసాద్ (మైదుకూరు)లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు సాదక్ అలి, కార్యదర్శి కిరణ్‌లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. కొత్త కార్యవర్గాన్ని జిల్లా లోని రైస్‌మిల్లలర్లు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

## కోడూరు సమస్యలు ఎంపి దృష్టి

### ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 23 ప్రభాతవార్త



రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని తిరుపతి తన నివా సంలో ఆదివారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గానికి సంబం ధించి ముఖ్య సమస్యలను ఎంపి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా దీపావళి పండుగను పురస్కరించుకొని ఎంపి మిథున్‌రెడ్డికి శుభాకాం క్షలు అందజేసినట్లు కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయిలు ఉన్నారు.

## వైకాపా సోషల్ మీడియా కోకన్వీనర్ నియామకం

దువ్వూరు, అక్టోబరు 23, ప్రభాతవార్త:



మండల పరిధిలోని చిన్నసింగనపల్లె గ్రామానికి చెందిన సన్నబల్లె దస్తగిరిని మైదుకూరు నియోజకవర్గం వైకాపా సోషల్ మీడియా కో కన్వీనర్‌గా నియమించా రు. ఈ మేరకు రాష్ట్ర సోషల్ మీడియా విభాగం నియా మకం చేసినట్లు దస్తగిరి తెలిపారు. గతంలో కూడా మండల, నియోజకవర్గ కోకన్వీనర్‌గా పని చేశానని తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి తిరిగి నియమించారన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, మండల వైకాపా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రక్తదాతే నిజమైన ప్రాణదాత..!!

చిట్వేలి, అక్టోబరు 23 ప్రభాతవార్త



జన్మనిచ్చేది తల్లిదండ్రులైన, ఆపద సమయంలో రక్తదాత పునర్జన్మనిస్తాడని జిల్లా స్టేఫ్ మేనేజర్ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆదివారం చిట్వేలి మండలం ఎం.రాచపల్లె గ్రామంలో తెలుగు సినీ హీరో ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా రెడ్‌క్రాస్ వారి ఆధ్వర్యంలో క్షత్రియ సంఘం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 52 మంది దాతలు ముందుకు వచ్చి రక్తదాతలుగా నిలిచి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ చంద్రశేఖర్, కార్యక్రమ నిర్వాహకులు అజయ్‌రాజు రక్తదాతలందరికి ప్రశంసా పత్రాలను అం దించారు. ఆపదలో ఉన్నప్పుడు కుల మతాలకతీతంగా ప్రాణాపాయంలో ఉన్న మనిషికి రక్తాన్ని ఇవ్వడం ద్వారా ప్రాణదాతగా నిలవచ్చని, ఇలాంటి మంచి పనులకు యువత ముందుకు రావాలని వారు అన్నారు.కార్యక్రమంలో డి.గిరిబా బురాజు, దొండ్లవాగు శ్రీనివాసులు, అజయ్‌రాజు, ఎల్లమరాజు, వరుణ్, వెంకటే శ్‌రాజు, రాఘవేంద్రరాజు, గ్రామ పెద్దలు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

## 25న గండి క్షేత్రంలో స్వామివారి తలుపులు మూసివేత

చక్రాయపేట, అక్టోబర్ 23ప్రభాతవార్త:

సూర్యగ్రహణం సందర్భంగా ఈనెల 25వ తేదీ ఉదయం 9 గంటల నుండి గండిక్షేత్రంలోని శ్రీ వీరాంజనేయస్వామి వారి దేవాలయం తలుపులు మూసివే యడం జరుగుతుందని గండిక్షేత్రం అసిసెంట్ కమిషనర్, కార్య నిర్వహణాధికారి అలవలపాటి ముకుందరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున స్వామివారి దర్శనానికి విచ్చేయు భక్తాదులు ఉదయమే వచ్చి దర్శించుకోవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## రైతు మృతదేహం లభ్యం

దువ్వూరు, అక్టోబరు 23, ప్రభాతవార్త:

మండలంలోని పెద్దబాకరాపురానికి చెందిన కొండారెడ్డి అనే రైతు మృత దేహం చెన్నూరు మండలం కొండపేట వద్ద పెన్నానదిలో లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం పెద్దబాకరాపురం గ్రామానికి చెందిన కొండారెడ్డి అనే రైతు రాజుపాళెం మండలం టంగుటూరు వంతెన వద్ద కుందూలో దూకి గల్లంత య్యారు. గల్లంతైన రోజు నుంచి దువ్వూరు పోలీసు స్టేషన్‌లో తప్పిపోయినట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశారు. కొండారెడ్డిది వ్యవసాయ కుటుం బం. ఇటీవల పొలంలో మినుము, తదితర పంటలు సాగు చేసి నష్టపోయాడు. అప్పులు ఎలా తీర్చాలని కుటుంబ సభ్యులతో చర్చించుకొని తీర్చలేననే బాధతతో కుందూలో దూకినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత రెండు రోజులుగా కొండారెడ్డి కోసం వెతకగా ఆదివారం పెన్నానదిలో లభ్యం కాగా చెన్నూరు పోలీసులు కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిర్వహించారు.

# పేదోడి ముంగిట పేలనంటున్న టపాసులు

## నాలుగు రెట్ల ధరలతో అమ్మకం : చూసి చూడనట్లు అధికారులు

చిట్వేలి, అక్టోబరు 23 ప్రభాతవార్త



చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా పిల్లా పెద్దలు కలిసి జరుపుకునే భారతీయ పండుగ దీపావళి. ద్వార యుగంలో శ్రీకృష్ణుని భార్య సత్యభామ నరకాసురుని వధించడంతో ఈ దీపావళికి బీజం పడిందన్నది పురాతన గాథ. ఈ రోజున తమ శక్తికొలది నూతన బట్టలు, మిఠాయిలు దాంతో పాటు టపాసులు పేల్చడం ఆనవాయితీ. కాగా టపాసుల ధరలు పేదోకిడి అందని ద్రాక్షలా మారాయి. చిచ్చుబుడ్డీలు మొదలు ఆకాశంలో మిరుమిట్టుగొలిపే తారాజువ్వలు వందల రేట్లలోనే పలుకుతున్నాయి. పిడికెడు సంచికి కొనాలన్నా వేలాది రూపాయలు వచ్చించాల్సిన పరిస్థితి. చిట్వేలి గరుగుపల్లె రహదారిలోని సాయిబాబా గుడి దగ్గర 6 తాత్కాలిక టపాసుల దుకాణాలకు, ఒకటి పూర్తిస్థాయి విక్రయ దుకాణానికి అధికారులు అనుమతులు ఇచ్చినప్పటికీ భద్రతా ప్రమాణాలను ఏమాత్రం పాటించలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

### పైకి ఆఫర్లు లోపల రెట్టింపు ధరలుః

వాస్తవానికి టపాసులు తయారీకి శివకాసి పెట్టింది పేరు. దీపావళి కోసం సంవత్సరం అంతా టపాసులు తయారీలోనే అక్కడివారు నిమగ్నం అవుతారు. కాగా అక్కడి నుంచి లక్ష రూపాయల సరకు తెప్పించుకున్న వ్యాపారులు నాలుగైదు లక్షల ఆదాయం గడిస్తున్నారంటే నమ్మశక్యం కాదు. కానీ ఇది నిజం.!! అయితే మూడు రోజులు వ్యవధిలోనే లక్షల్లో ఆదాయం ఉండడంతో అధికారులకు కాస్తా కూస్తో ముట్టజెప్పి స్థానిక వ్యాపారులు సిండికేటు అయి తమ ధరలను నాలుగింతలు చేసి, పైకి 30 శాతం ఆఫర్లని చెబుతూ లోపల భారీ ఆదాయాన్ని గడిస్తున్నారని, తాము కొనే, అమ్మే టపాసులకు వ్యాపారులు బిల్లులు చూపకపోగా చూపించమని అడిగే అధికారులు లేనే లేరని కాబట్టే ధరలు విపరీతంగా పెంచి సామాన్యులపై భారం మోపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### చూసి చూడనట్లు అధికారులుః-

వాస్తవానికి టపాసులు అమ్మాలంటే రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక తదితర శాఖల ద్వారా ముందస్తుగా తాము వ్యాపారం నిర్వహించు ప్రదేశాన్ని చూపెట్టి పాటించాల్సిన నియమ నిబంధనలను అంగీకారం పొందాలి. కాని కనీస భద్రతా నియమాలు పాటించకుండా నాలుగు రేకులతో చుట్టూరా ప్లాస్టిక్ కవర్ చుట్టి తాత్కాలిక షెడ్లు తయారు చేసుకుని గత సంవత్సరంలో మిగిలిన స్టాకును ముందుగా విక్రయిస్తూ వేలాది రూపాయలు వెచ్చించి కొన్నవారికి అవి పేలకుండానే నిరాశ మిగులుస్తున్నాయని, లక్షల అర్జన ధ్యేయంగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. చక్కదిద్దాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మిన్నకుంటున్నారని ఇకనైనా అధికారులు స్పందించి ధరలు అదుపులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని చిట్వేలి మండల ప్రజలు మనవి చేసుకుంటున్నారు. కాగా టపాసుల దుకాణానికి అనుమతి లభించకముందే టపాసులు తీసుకొచ్చి గోడంలలో నిల్వ ఉంచి విక్రయాలు కొనసాగించారని ఆరోపణలు ఉన్నాయి.

